21 . 01. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 227 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper


## యూరియా యాప్ పై కేంద్రం ప్రశంసలు

- ఖరీఫ్ కల్లా అన్ని జిల్లాలలో యాప్ సేవలు అమలు
- సేంద్రియ, ఆర్గానిక్ వ్యవసాయాలు చేసేలా రైతులను ప్రోత్సహించాలి
- ఆర్గానిక్ పంటలకు సర్టిఫికేషన్ ఇచ్చేలా త్వరలో సర్టిఫికేషన్ యాప్
- అన్ని కమిటీలలో రైతుల ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశం

# దావోస్‌లో తెలంగాణ బృందం బిజీ







యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యం

సౌదీ పారిశ్రామిక సంస్థ 'ఎక్స్ పర్టైజ్' ఆసక్తి

సిఎం రేవంత్‌తో ప్రతినిధి బృందం చర్చలు



భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తోడ్పాటు

తెలంగాణతో కలిసి పనిచేస్తామన్న యూఏఈ

రేవంత్‌తో మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ భేటీ

తెలంగాణతో భాగస్వామ్యానికి గూగుల్ ఆసక్తి

సీఎం రేవంత్ రెడ్డితో గూగుల్ ఏపీఏసీ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా భేటీ

ట్రాఫిక్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్‌లు, వ్యవసాయం, క్లైమేట్ చేంజ్ రంగాల్లో సహకారం

ఇజ్రాయెల్ ఐఎ ఛైర్మన్ అలోన్ స్టోపెల్ తో రేవంత్ భేటీ

**హైదరాబాద్,జనవరి20 వెలుతురు:**
దావోస్‌లో తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం మొదటి రోజున బిజీ బిజీగా గడిపారు. ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ ఛైర్మన్ అలోన్ స్టోపెల్ తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. సీఎంతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్ లకు సహకారాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ ఇన్నోవేషన్‌తో పాటు హెల్త్ టెక్, అగ్రి-టెక్, సైబర్ సెక్యూరిటీ, ఎరో స్పేస్ వంటి సాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతు ఇవ్వడంతో పాటు భాగస్వామ్యం పంచుకుంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహా పలు రంగాల్లో ఇజ్రాయిలీ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణ పైలట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనుంది. ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లలో భాగస్వామ్యం

# భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తోడ్పాటు

- బిజెపి కొత్త సారథిగా నితిన్ నబిన్ సిన్హా
- పార్టీ కార్యాలయంలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరణ
- హాజరైన ప్రధాని మోడీ, నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్, గడ్కరీ
- సామాన్య కార్యకర్తకు అత్యున్నత స్థానానికి ఎదగడం బిజెపిలోనే సాధ్యం
- వివిధ అంశాలపై నితిన్ భావోద్వేగ ప్రసంగం
- నా బాస్ నితిన్ నబిన్ అంటూ మోడీ చమత్కారం



**న్యూఢిల్లీ,జనవరి20 వెలుతురు:**
భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నితిన్ నబీన్ సిన్హా మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ సమక్షంలో కమల దళపతిగా నితిన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ తదితరులు హాజరయ్యారు. నితిన్ నబిన్ ఎన్నికైనట్లు పత్రాన్ని డాక్టర్ కె.లక్ష్మణ్ అందచేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి





## మేడారం జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులు సమర్థవంతంగా నిర్వహించాలి

- అదనపు బస్సులు అందుబాటులో ఉంచుకోవాలి
- ఆర్టీసీ అధికారులు మేడారం జాతర పూర్తయ్యే వరకు మేడారంలోనే ఉండి ఆపరేషన్స్ నిర్వహించాలి..
- రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి జాతర కి వచ్చే భక్తులకు విస్తృత అవగాహన కలిగించేలా హోర్డింగ్స్ తో పాటు ఇతర మాధ్యమాల ప్రచారం నిర్వహించాలి.
- ఆర్టీసీ లో పెండింగ్ పనులు, బస్ స్టేషన్ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి చేయాలి - మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 20:**
మేడారం జాతర కి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ సమర్థవంతంగా బస్సుల ఆపరేషన్స్ నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో సెక్రటేరియట్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గత మేడారం జాతర లో 3491 ఆర్టీసీ బస్సులు నడిపించగా 16.82 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించారు. ఈసారి 20 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ లో ప్రయాణం చేస్తారనే అంచనా తో 4000 బస్సులను

## భారతీయ భాషలు వారసత్వానికే కాదు దేశ భవిష్యత్తుకు పునాదులు

- గ్రామీణ, పట్టణ ప్రజల మధ్య అంతరం తగ్గాలంటే...
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో 'రాజభాష సమ్మేళనానికి' హాజరైన కేంద్ర మంత్రి
- ఉన్నత విద్య, డిజిటల్ ప్లాట్ ఫారాలన్నీ సొంత భాషల్లో అందుబాటులోకి రావాల్సిందే
- ఏ నాగరిక సమాజానికైనా భాష ఆత్మ లాంటిదని వెల్లడి





**ఇండోర్ వెలుతురు జనవరి 20:**
దేశంలో ఉన్నత విద్య, పరిశోధనలు, స్టార్టప్‌లతోపాటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లన్నీ మన సొంత భాషల్లో అందుబాటులోకి వచ్చినప్పుడే జ్ఞానానికి నిజమైన ప్రజాస్వామీకరణ సాధ్యమవుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా సాంకేతికత, కృత్రిమ మేధస్సు (Artificial Intelligence) భాషా సాంకేతికత ఈ దిశలో కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ రంగాల్లో భారతీయ భాషలను కేంద్రంగా ఉంచితే గ్రామీణ, పట్టణ భారత్ మధ్య ఉన్న డిజిటల్ అంతరం దానికదే తగ్గుతుందని అన్నారు. హిందీతోపాటు భారతీయ భాషలు కేవలం గతానికి చెందిన మన వారసత్వం మాత్రమే కాదని, అవి దేశ భవిష్యత్తుకు పునాదులుగా నిలుస్తాయని తెలిపారు. మంగళవారం రోజున మధ్యప్రదేశ్ లోని ఇండోర్ దేవి అహల్య విశ్వవిద్యాలయంలో నిర్వహించిన "మధ్య, పశ్చిమ మరియు దక్షిణ ప్రాంతాల ఉమ్మడి ప్రాంతీయ అధికారిక భాషా సమ్మేళనం" కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. రాజభాషలో విశిష్ట సేవలందించిన పలువురికి అవార్డులు అందజేశారు. వివిధ హిందీ సేవా సంస్థలు, బ్యాంకులు ఏర్పాటు చేసిన బుక్ స్టాల్స్ ను, హ్యాండిక్రాఫ్ట్ స్టాల్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమ్మేళనానికి కేంద్ర మంత్రితోపాటు స్థానిక ఇండోర్ ఎంపీ శంకర్ లాల్వాణీ, దేవి అహిల్యా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా. రాకేశ్ సింఘై, హిందీ విద్యావేత్తలు జే ఎల్ రెడ్డి, నర్మదా ప్రసాద్, రాజభాషా విభాగం కార్యదర్శి శ్రీమతి అంజలి ఆర్య, సంయుక్త కార్యదర్శి డా. నిధి పాండే తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సమ్మేళనంలో చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు.... దేశంలోని మధ్య, పశ్చిమ, దక్షిణ ప్రాంతాల సంయుక్త ప్రాంతీయ రాజభాషా సదస్సు సందర్భంగా ఇండోర్ రావడం సంతోషంగా ఉంది. దేవి అహిల్యా విశ్వవిద్యాలయం వంటి జ్ఞానభూమిలో అధికారిక భాషా సమ్మేళనం జరగడం అదృష్టంగా భావిస్తున్నా. దేశవ్యాప్తంగా వివిధ కేంద్ర విభాగాలు, కార్యాలయాల్లో అధికారిక భాషా సంబంధిత నిబంధనల అమలును

# రాష్ట్రంలో 50-శాతం పచ్చదనం

- రాష్ట్ర భూ భాగంలో 2047 నాటికి 50 శాతం గ్రీనరీ
- ఉగాది నుంచి గ్రీన్ కవర్ యాక్షన్ ప్లాన్ అమలు
- గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి వృక్షాలకు ప్రాధాన్యం
- తీర ప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పు నీటిని తట్టుకునే మొక్కల పెంపకం
- నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు సన్నద్ధం కావాలి
- అటవీశాఖతో పాటు వివిధ శాఖల అధిపతులతో పవన్ కళ్యాణ్ సమీక్ష



**అమరావతి,జనవరి20 వెలుతురు:**
రాష్ట్రాన్ని 50 శాతం పచ్చదనంతో నింపే గ్రీన్ కవర్ ప్రాజెక్టులో అన్ని శాఖలు త్రికరణ శుద్ధిగా భాగస్వామ్యం తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు ఉగాదిలోపు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఉగాది నుంచి గ్రీన్ కవర్ యాక్షన్ ప్లాన్ అమలు కావాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ.. కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటేందుకు, తీర ప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పు నీటిని తట్టుకునే మొక్కల పెంపకానికి సిద్ధం కావాలని నిర్దేశం చేశారు. గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి వృక్ష జాతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత వర్గాలకు సూచనలు చేశారు. మంగళవారం వెళగపూడి లోని రాష్ట్ర సచివాలయంలో అటవీశాఖతో పాటు వివిధ శాఖల అధిపతులు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 50 శాతం గ్రీన్

# దావోస్‌లో బిజీగా సిఎం చంద్రబాబు

- పలువురు ప్రముఖులతో భేటీలు, ● ఎపి పారిశ్రామిక విధానంపై బాబు వివరణ



**దావోస్,జనవరి20( వెలుతురు):**
ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనలో భాగంగా రెండో రోజు పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఏపీకి కావాల్సిన పెట్టుబడులపై సీఎం సుదీర్ఘంగా చర్చించారు. పెట్టుబడుల సాధన, ఏపీ బ్రాండింగ్, రాష్ట్రంలోని వనరులను వివరించేలా ప్రపంచ ఆర్థిక సదస్సుకు ముఖ్యమంత్రి బృందం హాజరైంది. వివిధ జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఏపీలో అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలను తెలుసుకునేందుకు పలువురు పారిశ్రామిక వేత్తలు ఆసక్తికనబరిచారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్, గ్రీన్ అమ్మోనియా ఎ÷-లాంట్ వంటి పెట్టుబడులతో ప్రపంచ ఆర్థిక సదస్సులో విశాఖపట్నం, కాకినాడ చర్చనీయాంశంగా మారాయి. వివిధ దేశాల్లో రంగాల వారీగా అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలను సీఎం చంద్రబాబు అధ్యయనం చేస్తున్నారు. ఏపీలో అమలు చేస్తున్న పారిశ్రామిక

# దావోస్‌లో తెలంగాణ బృందం బిజీ

పంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా (ఏపీఏసీ) ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సమావేశమయ్యారు. ప్రధానంగా వాతావరణంలో పెను మార్పులు, వ్యవసాయంపై దాని ప్రభావం, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్యం వంటి సమస్యల పరిష్కారాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి నమూనాను వివరించారు. కోర్ హైదరాబాద్ సిటీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలను వివరించారు. ట్రాఫిక్ కంట్రోల్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ ఇన్నోవేషన్‌కు మరింత మద్దతు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తొలి గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను హైదరాబాద్లో ఏర్పాటు చేసినందుకు గూగుల్ బృందానికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎరువుల అతిగా వినియోగం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరంపై ఈ సమావేశంలో ప్రతినిధుల బృందం చర్చించింది. సమస్యల పరిష్కారానికి, సమస్యలు తలెత్తకుండా నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గూగుల్ ఏపీఏసీ ప్రెసిడెంట్ శ్రీ సంజయ్ గుప్తా మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లు మరియు వాతావరణ మార్పు అంశాల్లో తెలంగాణకు పూర్తి స్థాయిలో మద్దతు అందించేందుకు గూగుల్ సిద్ధంగా ఉందని తెలిపారు. సీఎంతో పాటు సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విస్తృత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, బీఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలాతో భాగస్వామ్యం, ఏఐ పాఠ్యాంశాల అమలును ప్రధానంగా ప్రస్తావించారు. ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా, టీ-÷బైర్ ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ అందిస్తుందని వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి హెచ్.ఈ. అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదిక -2026 సదస్సులో భాగంగా దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో యూఏఈ మంత్రి మంగళవారం భేటీ అయ్యారు. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ను వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి అవకాశాలపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇది దేశంలోనే తొలి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల్లో విస్తరించే ఈ నగరంలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్ లో ఇప్పటికే మారుబేని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని, ఇటీవలే రిలయన్స్ గ్రూప్ వంతారాతో ఫ్యూచర్ సిటీలో కొత్త జూ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సీఎం వెల్లడించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రాజెక్ట్ వేగవంతమయ్యేందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో తెలంగాణ కలిసి పనిచేసి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ 'ఎక్స్ పర్టైజ్' స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యమయ్యేందుకు ఆసక్తి వ్యక్తం చూపింది. సంస్థ ప్రెసిడెంట్ , సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్, దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థకు ఉద్యోగ అవకాశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, ప్రాక్టికల్ శిక్షణ అందించడమే స్కిల్ యూనివర్సిటీ ప్రధాన ఉద్దేశమన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 2047 విజన్‌కు అనుగుణంగా తెలంగాణను భవిష్యత్‌కు సిద్ధమైన ప్రతిభా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రాథమిక విద్య, ఆధునిక నైపుణ్యాలు, శిక్షణ, మెంటార్‌షిప్ ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం సాధించడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. భారతదేశంలో పూర్తిగా పరిశ్రమల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న తొలి విశ్వవిద్యాలయం స్కిల్ యూనివర్సిటీయే నని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ ప్టంల్గ÷జ్ సంస్థ సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా సుమారు 5వేల మంది నైపుణ్య కలిగిన సిబ్బందిని నియమించుకునే అవసరం తమకు ఉందని, ఆ అవసరాలను తీర్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యం చేసుకోవాలని ప్రతిపాదించారు. అవసరమైన అన్ని విభాగాల్లో శిక్షణను యూనివర్సిటీ తో కలిసి ప్రారంభించాలనుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో ఈ సంస్థ, పెట్రో కెమికల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎరువులు, స్టీల్, సిమెంట్, వాటర్ ట్రీట్‌మెంట్, విద్యుత్ ఉత్పత్తి వంటి నైపుణ్యాధారిత రంగాల్లో ప్లాంట్ నిర్వహణ సేవలను అందిస్తోంది. ఈ సమావేశంలో తెలంగాణ తరఫున ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## మేడారం జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులు సమర్థవంతంగా నిర్వహించాలి

నడిపిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అయితే ప్రధానంగా మేడారం వెళ్ళే రూట్లలో వరంగల్ ,హనుమకొండ , ఖమ్మం,కరీంనగర్ రూట్లలో రద్దీ ఎక్కువగా ఉండనుండడంతో రద్దీగా తగిన విధంగా బస్సులు నడపడానికి అక్కడ అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మేడారం లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ స్టాప్ లో క్యూలైన్ ల వద్ద ప్రయాణికులు జిల్లాల వారిగా వెళ్ళే బస్సులు డిస్ప్లే అయ్యేలా చూడాలని అక్కడ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా పని చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.మేడారంలో సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టినట్టు శాశ్వత ఆర్టీసీ సముదాయ భవనాన్ని నిర్మించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి జరుగుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మేడారం వచ్చే భక్తులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగించేలా హోర్డింగులు, బస్ స్టేషన్లలో , బస్సులో టీవీ ల ద్వారా ప్రచారాలు నిర్వహించాలని సూచించారు.. ఆర్టీసీ లో పెండింగ్ పనులు బస్ స్టేషన్ ల అభివృధి పనుల పురోగతి పై ఆరా తీశారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో రాబోయే కాలంలో పూర్తిస్థాయిలో ఈవి బస్సులు రానుండడంతో అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాలు, ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పుడున్న జెబిఎస్ , ఎంజీబీఎస్ మాదిరి నగరంలో మరిన్ని బస్ టెర్మినల్ రావాల్సిన అవసరముందని దానిని స్టడీ చేయాలని ఆర్టీసీ కి సంబంధించిన భూ బదలాయింపు పై జిల్లా కలెక్టర్ల తో మాట్లాడాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న కాలని లకు ఆర్టీసీ ప్రజా రవాణా లో బాగంగా కొత్త రూట్లలో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ బస్సు మంచి సత్ఫలితాలు ఇస్తుండటంతో తెలంగాణ వ్యాప్తంగా అవసరమైన రూట్లలో బస్సులు నడిపించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విజన్ 2047 లో ఆర్టీసీ లక్ష్యానికి అనుగుణంగా ఇప్పుడున్న బస్సుల సంఖ్యను మరింత పెంచడం , ఉద్యోగుల సంఖ్యను పెంచడం తదితర వాటిపై కార్యాచరణ తో ముందుకు పోవాలని ఆదేశించారు. సెర్ప్ ద్వారా తీసుకోవాల్సిన మిగిలిన బస్సులను త్వరగా ఆర్టీసీ లోకి తీసుకోవాలి. కింది స్థాయిలో క్షేత్ర స్థాయిలో విజిట్ చేసిన అంశాలు ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. నూతనంగా నిర్మితమవుతున్న పెద్దపల్లి ,ఏటూరు నాగారం బస్ డిపో ల నిర్మాణాలు వేగంగా జరగాలని ఆదేశించారు. మహా లక్ష్మి ద్వారా 90 కి పైగా డిపోలు లాభాల బాటలో ఉన్నప్పటికీ మిగిలిన డిపో లు నష్టానికి గల కారణాలపై అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి,ఆర్టీసీ ఈడి లు , ఆర్ ఎం లు ,ఇతర ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## భారతీయ భాషలు వారసత్వానికే కాదు దేశ భవిష్యత్తుకు పునాదులు

నిర్ధారించడంలో, పాలనలో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడంలో రాజ్-భాషా విభాగం కీలక పాత్ర పోషిస్తోంది. ప్రియతమ ప్రధాని మోదీ చెప్పినట్లుగా ఏ నాగరిక సమాజానికైనా భాష ఆత్మ లాంటిదే. మోదీ నాయకత్వంలో భారత్ తన సాంస్కృతిక పునాదితో అనుసంధానమవుతూ ఆత్మనిర్భరత వైపు దృఢంగా ముందుకు సాగుతోంది. కొత్త జాతీయ విద్యా విధానంలో భారతీయ భాషలను విద్య, జ్ఞానానికి మౌలిక ఆధారంగా చేసుకొని ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతున్నాం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో హిందీతోపాటు భారతీయ భాషలను పరిపాలనలో, సాంకేతికతలో ప్రపంచ స్థాయి సంభాషణలతో అనుసంధానించేందుకు కేంద్రం క్రుషి చేస్తోంది. ఈ రోజు రాజభాషా విభాగం కేవలం నియమావళి అమలు చేసే విభాగంగా కాకుండా, నవ ఉత్తేజం, సాంకేతిక సాధికారతలో అగ్రభాగాన నిలిచే సంస్థగా మారింది. రాజభాషా విభాగం ప్రారంభించిన హిందీ శబ్ద సింధు, భారతీయ భాషా విభాగం, భారతి బహుభాషీ అనువాద సారథి వంటి అప్లికేషన్లు, ఆధునిక అనువాద సాధనాలు నేడు పరిపాలనను మరింత సరళంగా, పారదర్శకంగా ప్రజలకు అనుకూలంగా మార్చుతున్నాయి. ఈ ప్రయత్నాలు భాష ఒక అడ్డంకిగా కాకుండా వారధిలా మారేలా చేస్తున్నాయి. ఎందుకంటే భాష కేవలం పరిపాలనా సౌకర్యం మాత్రమే కాదు. భాష ఆలోచనలకు జన్మనిస్తుంది, సంస్కారాలను ముందుకు తీసుకెళ్తుంది. సమాజానికి దిశను చూపిస్తుంది. మాతృభాషలో పొందిన జ్ఞానం మరింత స్థిరమైనది, విస్తృతమైనది. అదే సమయంలో ఇతర భాషలు మనల్ని ప్రపంచ వేదికతో అనుసంధానిస్తాయి. అందుకే హిందీతో పాటు అన్ని భారతీయ భాషలను గౌరవించాల్సిన అవసరముంది. ఈరోజు 'హిందీ' భాష ప్రపంచ వేదికపై కూడా బలంగా నిలిచింది. విద్య, మీడియా, సినిమా, సాహిత్యం, డిజిటల్ మాధ్యమాలు హిందీకి ప్రపంచవ్యాప్త గుర్తింపును తెచ్చాయి. దేశవిదేశాల్లో కోట్లాది మంది హిందీ ద్వారా భారత్‌తో అనుసంధానమై ఉన్నారు. ఇది మన సాంస్కృతిక శక్తికి నిదర్శనం. రాబోయే కాలం హిందీతోపాటు భారతీయ భాషలను విద్య, విజ్ఞానం, సాంకేతికత, న్యాయం, వ్యాపారం వంటి ప్రతి రంగంలో మరింత బలోపేతం చేయడానికి మనకు ఒక గొప్ప అవకాశాన్ని ఇస్తోంది. ఉన్నత విద్య, పరిశోధన, స్టార్టప్‌లు మరియు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు మన స్వంత భాషల్లో అందుబాటులోకి వచ్చినప్పుడు, జ్ఞానానికి నిజమైన ప్రజాస్వామ్యీకరణ సాధ్యమవుతుంది. సాంకేతికత, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (Artificial Intelligence) భాషా సాంకేతికత ఈ దిశలో కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. ఈ రంగాల్లో భారతీయ భాషలను కేంద్రంగా ఉంచితే గ్రామీణ మరియు పట్టణ భారత్ మధ్య ఉన్న డిజిటల్ అంతరం దానికదే తగ్గుతుంది. హిందీతోపాటు భారతీయ భాషలు కేవలం గతానికి చెందిన మన వారసత్వం మాత్రమే కాదు. అవి భారత్ భవిష్యత్తుకు పునాదులు. అన్ని భాషలకు సమాన గౌరవం, అవకాశాలు లభించినప్పుడు మాత్రమే జాతీయ ఐక్యత, ఆత్మనిర్భరత బలపడతాయి. ఈ సందర్భంగా రాజభాష అవార్డు గ్రహీతలందరికీ నా హృదయపూర్వక అభినందనలు. భవిష్యత్తులో తమ తమ రంగాల్లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పుతూ, హిందీ వినియోగాన్ని మరింత పెంచేందుకు నిరంతరం కృషి చేస్తారని, అలాగే ఇతరులను కూడా హిందీలో పని చేయడానికి ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నా. నేను తెలుగు మాట్లాడే తెలంగాణ రాష్ట్రం నుండి వచ్చాను. ఒకప్పుడూ నాకు హిందీ రాదు, కానీ అమిత్ షా ప్రోత్సాహం వల్ల ఇప్పుడు నా పనులన్నీ హిందీలోనే పూర్తి చేస్తున్నాను. రాజభాషా విభాగం చేస్తున్న ఈ ప్రయత్నాల ద్వారా మన పని తీరులో హిందీని మరింతగా ఉపయోగించేందుకు మనకు ప్రేరణ కలుగుతుందని నాకు పూర్తి నమ్మకం ఉంది.

## దావోస్‌లో బిజీగా సిఎం చంద్రబాబు

విధానాలు, తెచ్చిన పాలసీలను పారిశ్రామిక వేత్తలకు సీఎం వివరించారు. 1998 నుంచి చంద్రబాబు దావోస్‌కు వస్తున్న విషయాన్ని పలువురు పారిశ్రామిక వేత్తలు ప్రస్తావించారు. దావోస్ మ్యాన్ అంటూ సీఎం చంద్రబాబును తన సహచరులకు ఈరోస్ సీఈఓ కిషోర్ లుల్లా పరిచయం చేశారు. గతేడాది దావోస్ పర్యటనతో ఏపీలో రూ. 2.36 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారమయ్యాయనే అంశంపై భారతదేశం నుంచి వచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో చర్చించారు. వివిధ రంగాల్లోని 20 ప్రాజెక్టుల ద్వారా సుమారు రూ. 2.36 లక్షల కోట్ల పెట్టుబడులను గతేడాది కూటమి ప్రభుత్వం రాబట్టిందని సీఎం గుర్తుచేశారు. ఐటీ రంగంలో దాదాపు రూ. 1.36 లక్షల కోట్లు, స్టీల్ రంగంలో సుమారు రూ. 62 వేల కోట్లు వచ్చాయని స్పష్టం చేశారు. ఇంధన రంగంలో దాదాపు రూ.23 వేల కోట్లు, ఎలక్ట్రానిక్స్ రంగంలో సుమారు రూ. 9 వేల కోట్లు వచ్చాయని తెలిపారు. డిఫెన్స్-ఎయిరో స్పేస్ రంగంలో రూ.2 వేల కోట్లు, ఇన్ఫ్రా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రూ. 4 వేల కోట్లు వచ్చాయని వెల్లడించారు. ఏపీలో వివిధ సంస్థలు ఇప్పటికే మొదలుపెట్టిన ప్రాజెక్టులను మరింత విస్తరించేలా పలువురు పారిశ్రామిక వేత్తలతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సంప్రదింపులు జరుపుతున్నారు. గూగుల్, ఐబీఎం వంటి కీలక సంస్థలకు చెందిన ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతిలో క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఐబీఎం ప్రతినిధులకు సీఎం ప్రతిపాదించారు. ఐబీఎం భాగస్వామ్యంతో అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేసేలా ఇప్పటికే ఏపీ ఒప్పందం చేసుకుందని ప్రస్తావించారు. ఏపీలో 10 లక్షల మందికి ఏఐ, క్వాంటం, సైబర్ సెక్యూర్టీపై నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ఐబీఎం ప్రతినిధులను ముఖ్యమంత్రి కోరారు.రాష్ట్రానికి పెట్టుబడుల సాధనలో మంత్రి నారా లోకేశ్ కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రంలో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేలా ఆర్ఎంజెడ్ గ్రూప్ ప్రతినిధులతో లోకేశ్ సంప్రదింపులు జరపగా ఆర్ఎంజెడ్ గ్రూప్ అంగీకరించింది. విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల్లో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టనుంది ఆర్ఎంజెడ్ గ్రూప్. జీసీసీలు, హైపర్ స్కేల్ డేటా సెంటర్, ఇండస్ట్రియల్, లాజిస్టిక్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది ఆర్ఎంజెడ్ గ్రూప్. ఏపీలో పర్యటించేందుకు, పరిశ్రమలు స్థాపించేందుకు మరికొన్ని అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపించాయి. నేషన్ ఫస్ట్ అనే స్ఫూర్తితో పని చేస్తామని దావోస్‌లో ఇండియా లాంజ్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా జరిపిన సంప్రదింపులతో రూ.2.36 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ప్రస్తుతం అవి గ్రౌండ్ అవుతున్నాయి.

## యూరియా యాప్ పై కేంద్రం ప్రశంసలు

**హైదరాబాద్,జనవరి20 వెలుతురు:**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ ను కేంద్ర ఫెర్టిలైజర్ శాఖ అభినందించిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. వచ్చే ఖరీఫ్ కల్లా ఈ యాప్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తేవాలని అన్నారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, కో-ఆపరేషన్ మరియు హార్టికల్చర్ శాఖల పురోగతిపై వ్యవసాయశాఖ సెక్రటరి మరియు ఆయా శాఖల డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం మరియు తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, అలాగే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలు రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నప్పటికి, మార్కెట్లో నకిలీ ఆర్గానిక్ లేబుల్లతో నకిలీ ఉత్పత్తులు చలామణీ అవుతున్నందున నిజమైన ఆర్గానిక్ పంటలు పండించే రైతులకు నష్టం చేకూరుతుందని మంత్రిగారు అన్నారు. ఇందుకోసం వ్యవసాయశాఖ ఆర్గానిక్ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇచ్చే విధంగా ఒక యాప్ తీసుకురానుందని అన్నారు. ఈ యాప్ ద్వారా కొనుగోలుదారు తాను కొనబోయే ఉత్పత్తి ఎక్కడ, ఏ రైతు, ఎలా పండించాడో తెలుసుకుంటాడని అన్నారు. అదేవిధంగా అగ్రివర్సిటీలలోని ఖాళీ ప్రదేశాలలో ఆర్గానికి పంటలు పండించి, అక్కడే స్టాల్స్ పెట్టి అమ్మిన్లటైతే రైతులు ఆర్గానిక్ పంటలవైపు వెళ్ళే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ÷ూష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఇప్పటికే 50 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా 50 కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు రైతులకు కావాల్సిన యంత్రాలు మార్కెట్ ధరలకే లభించేలా, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నేరుగా రైతులకు చేరేలా నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పట్టించుకోని కేంద్ర ప్రాయోజిత పథకాలను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాలనుసారం ఒకొక్కటిగా పునరుద్ధరిస్తోందని, అందులో భాగంగా ఈ సంవత్సరం వివిధ పథకాల క్రింద ఇప్పటికే రూ.500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే ప్రతి పైసను పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని, కేంద్రం నుంచి వచ్చే ఒక్క పైసా



కూడా వృథాగా తిరిగి వెళ్లకూడదని అధికారులకు సూచించారు. చ్చే ఖరీఫ్ నాటికి పెద్దమొత్తంలో యూరియా బఫర్ స్టాక్ లను నిల్వలో ఉంచుకోవాలని, భవిష్యత్తులో యూరియా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైల్వే రేక్ పాయింట్లను కూడా ఎరువుల పంపిణీకి తగ్గట్లుగా ఉండేలా, మరికొన్ని రైల్వే రేక్ పాయింట్లను అదనంగా ఏర్పాటు చేసేవిధంగా రైల్వే అధికారులను కోరాలని సూచించారు. ÷ూష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సన్నాలకు బోనస్ ఇస్తున్నందున, పంటకాలనికి అనుగుణంగా వ్యవసాయశాఖ ద్వారా సన్న వడ్లలో మేలైన వంగడాలను సూచించాలని, రైతులు అట్టి రకాలను ఉత్పత్తి చేసి మంచిధర పొందేటట్లు చూడాలని అన్నారు. ధికశాతం ఖచ్చితత్వంతో శాటిలైట్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ నెలాఖరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంటల శాటిలైట్ మ్యాపింగ్ డేటా రావాలని అధికారులను ఆదేశించారు. 3 సంవత్సరాల పంటల శాటిలైట్ మ్యాపింగ్ తో డేటా అందించాలని, డేటా ÷నైలైజ్ చేసేముందు ఒకసారి అధికారులతో ఫీల్డ్ వెరిఫికేషన్ చేయించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని శాఖల డిపాజిట్లు ప్రైవేట్ కమర్షియల్ బ్యాంకులలో కాకుండా కో-ఆపరేటివ్ మరియు అర్బన్ కోఆపరేటీవ్ బ్యాంకులలో చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. అందుకోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లో కేంద్రం ఇచ్చిన లక్ష్యానికి రెట్టింపు ఎ÷-లాంటేషన్ జరిగేలా అధికారులు పనిచేయాలని మంత్రి అన్నారు. తక్కువ పురోగతి ఉన్న ఆయిల్ పామ్ కంపెనీలను రద్దు చేసి, వాటిని ఆయిల్ ఫెడ్ సంస్థకు గాని, వేరే ఇతర కంపెనీలకు కేటాయించాలన్నారు. ఆయిల్ పామ్ కంపెనీలకు సంబంధించిన ఖాళీ ప్రదేశాలలో మోడల్ పామ్ అభివృద్ధి చేసి, ఆయిల్ పామ్ రైతుల సందర్శనార్థం ఉంచిన్లటైతే, వారికి వచ్చే అనుమనాలను కూడా నివృత్తి చేసుకోవడానికి వీలు కలుగుతుందని అన్నారు. పామ్ ఆయిల్ పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. 44 శాతానికి పెంచిన్లటైతే టన్ను ఆయిల్ పామ్ ధర 25000 వరకు చేరుకుంటుందని, దాంతో రైతులకు కూడా ఆయిల్ పామ్ పంట వేయలనే కోరిక పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బ్జడెట్ సమావేశాలలోనే దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. ÷ూష్ట్ర అవసరాల కోసం కూరగాయలను ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని, ఈ పరిస్థితి మారాలని మంత్రిగారు అన్నారు. డిమాండ్ కు తగ్గట్టుగా కూరగాయల సాగును ప్రోత్సహించాలని, కూరగాయల సాగులో విజయవంతం అయిన రైతులను రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఇతర రైతులతో మాట్లాడించాలి. గ్రామాలలోనే కాకుండా పట్టణాలలో కూడా అందుబాటులో ఉన్న స్థలాలలో మరియు టెర్రస్ ల మీద కూరగాయలు పండించేలా అవగాహన కల్పించాలని అన్నారు. ల్గ÷తులకోసం డిపార్ట్ మెంట్లలో గాని, యూనివర్సిటీలలో గాని మరియు కార్పోరేషన్లలో గాని ఏర్పాటు చేసే ప్రతి కమిటీలలో అధికారులతో పాటు రైతుల ప్రాతినిధ్యం వహించేలా కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా కమటీలలో రైతుల ప్రాతినిధ్యం ఉన్న్లటైతే రైతుల అవకాశాలు, అవసరాలకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకోవచ్చని అన్నారు. రైతు వేదికల దగ్గర సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. డిపార్ట్ మెంట్లకు సంబంధించి ఉన్న ఖాళీ ప్రదేశాలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి, ఉత్పత్తి అయి మిగిలిన కరెంట్ ను గ్రిడ్ కు అమ్ముకొవచ్చని అన్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా రెండు రైతువేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయగా, నెలకు 400 యూనిట్ల వరకు మిగులు కరెంట్ ఉత్పత్తి అవుతుందని అన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టీకల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఊంఅం ఎండి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తోడ్పాటు

సారి ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. భారత్ మాతాకీ జై అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన ఆయన.. 'ముందుగా మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఒక సాధారణ కార్యకర్తనైన నన్ను పార్టీలోనే అత్యంత ఉన్నతమైన పదవికి చేరేలా చేశారు. నేను మీకు తలవంచి నమస్కరిస్తున్నాను' అని అన్నారు.జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా.. ప్రధాని మోదీపై ప్రశంసల జల్లులు కురిపించారు. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని మోదీ నిరంతరంగా దేశం కోసం పాటుపడుతున్న తీరును సాధారణ కార్యకర్తలమైన తాము గమనిస్తూనే ఉన్నామన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'అది నేను నేషనల్ జనరల్ సెక్రటరీగా ఉన్న సమయం. అప్పుడు మీరు(ప్రధాని మోదీ) సభావన మిషన్ ప్రోగ్రామ్ సందర్భంగా ప్రతీ ఒక్కరి కష్టాలను అడిగి తెలుసుకోవటం చూశాను. ఆ ప్రోగ్రామ్ తర్వాత మేము మీ గ్రీన్ రూములో మిమ్మల్ని కలిశాము. గుజరాత్ నుంచి చాలా మంది ఆ ప్రోగ్రామ్‌కు ఎందుకు వస్తున్నారో భావోద్వేగపూరితంగా మీరు మాకు వివరించారు. ప్రజల ఎమోషన్స్‌తో కనెక్ట్ అయ్యే వారే గొప్ప నాయకులు అవుతారని నాకు అప్పుడు అర్థమయింది' అని చెప్పారు. సందర్భంగా నితిన్ నబీన్ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు



గుప్పించారు. తమిళనాడు ప్రభుత్వం తిరుప్పరన్కుండ్రం కొండపై కార్తీగై దీపం పండుగ జరగకుండా ఆపడాన్ని ఆయన తప్పుబట్టారు. సోమనాథ్, రామ సేతు, ఇతర చిహ్నాల గురించి మాట్లాడితే ప్రతిపక్ష పార్టీలు అసహనానికి గురవుతాయని అన్నారు. రామసేతు లేదు అనే వారికి, కార్తీగై దీపం పండుగను అడ్డుకునే వారికి భారత రాజకీయాల్లో చోటులేదని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నితిన్ నబీన్‌ను ప్రశంసించారు. ఇప్పుడు నబీన్ తనకు బాస్ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. నబీన్ తనకు బాస్ అని, తాను సాధారణ పార్టీ కార్యకర్త అని వ్యాఖ్యానించారు. 'భాజపాలో సాధారణ కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడు కాగలరు. భాజపాలో నిర్ణయాలు, ఎంపిక అన్నీ.. ప్రజాస్వామ్యయుతంగానే ఉంటాయి. దేశసేవ, ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేస్తున్నారు. గతంలో ఆడ్వాణీ, వెంకయ్యనాయుడు నేతృత్వంలో ఘన విజయాలు సాధించాం. అందరి కృషితోనే మూడుసార్లు అధికారంలోకి వచ్చేలా పార్టీ ఎదిగింది. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది. భాజపా కార్యకర్తను అనిపించుకోవడమే నాకు గర్వకారణం. భాజపాలో ప్రత్యేకంగా పదవులు, బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రతిఒక్క కార్యకర్త స్వయంగా బాధ్యతలు తీసుకోవాలి. బాధ్యతలు ఒకరి నుంచి ఒకరికి మారతాయి.. లక్ష్యం మారదు. నాయకత్వం మారినా.. మన గమ్యం మారదు. భాజపా చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని మోదీ అన్నారు. 45 ఏళ్ల నితిన్ నబీన్ కమల దళపతిగా నిన్న ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. పార్టీ చరిత్రలోనే చిన్న వయసులో జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఘనతను ఆయన సాధించారు. ఉమ్మడి బిహార్ నుంచి పార్టీ అధ్యక్ష స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ నిలిచారు. ప్రమాణ కార్యక్రమానికి పలు రాష్ట్రాల నేతలు, ఎంపిలు, కేంద్రమంత్రులు హాజరయ్యారు.

# చిన్న వార్త పత్రికలను తెలంగాణ ప్రభుత్వమే ఆదుకోవాలి

- తెలంగాణ ప్రభుత్వానికి చిన్న వార్త పత్రికలంటే చిన్నచూపెందుకు
- చిన్న వార్త పత్రికలకు ప్రెస్ క్లబ్ సభ్యత్వాలు, ప్రభుత్వ ప్రకటనలు(గవర్నమెంట్ అడ్స్) అక్రెడిటేషన్‌లు ఇవ్వాలి
- పేపర్ ఖర్చులు, ప్రింటింగ్ ఖర్చులకు ప్రత్యేక సహాయ నిధులు కేటాయించాలి
- తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కల్లూరి సుందర్ డిమాండ్



**హైదరాబాద్ వెలుతురు జనవరి 20:**
ప్రింట్ మీడియా సంక్షోభం, డిజిటల్ మీడియా పోటీ, పేపర్ ధరలు పెరగడం వల్ల చిన్న వార్త పత్రికలు కష్టాల్లో ఉన్నాయంటూ వాటిని పూర్తిగా ప్రభుత్వమే ఆదుకోవాలంటూ తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం(టీ జె ఎస్ ఎస్) కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీ జె ఎస్ ఎస్ ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి మాట్లాడుతూ, చిన్న పత్రికలు స్థానిక సమాచారాన్ని వ్యాప్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతాయన్నారు. గ్రామీణ సమస్యలు, ప్రజలకు అందించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. స్థానిక వ్యాపారాలకు చవకైన ప్రకటనలు అందించి ఆర్థిక వృద్ధికి తోడ్పడతాయని, పెద్ద మీడియా చూడని గ్రామీణ సమస్యలను ముందుగా బయటపెడతాయని అలాంటి చిన్న వార్తపత్రికలను తెలంగాణ ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చిన్న వార్త పత్రికలను, ప్రభుత్వ ప్రకటనలు (గవర్నమెంట్ అడ్స్), అక్రెడిటేషన్‌లు, ప్రెస్ క్లబ్ సభ్యత్వాల ద్వారా ఆదుకోవాలని, పేపర్ ఖర్చులు, ప్రింటింగ్ ఖర్చులకు ప్రత్యేక సహాయ నిధులు కేటాయించాలని సుందర్ కల్లూరి డిమాండ్ చేశారు.

# ఇండోర్ లో ప్రాణాలు తీసిన తాగునీరు

- పాలన వైఫల్యానికి ఇది ప్రత్యక్ష సాక్ష్యం
- డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 20:**



ఇండోర్ లో కలుషిత తాగునీరు తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోవడం దేశ పాలనా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. శుద్ధమైన తాగునీరు ప్రజలకు ప్రభుత్వం ఇచ్చే ఉపకారం కాదు,అది ప్రతి పౌరుడి మౌలిక హక్కు, రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ఇండోర్ లో జరిగిన ఈ విషాద ఘటన ఒంటరి సంఘటన కాదు. ఇది ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేస్తున్న అర్బన్ మోడల్" అసలు ముఖచిత్రాన్ని బయటపెడుతోంది. మీడియా ఒత్తిడి ఉన్నప్పుడు తాత్కాలిక చర్యలు, కెమెరాలు వెళ్లిన వెంటనే మౌనం. ఇదే నేటి పాలన విధానం. సమస్య మూలాలను పరిష్కరించకుండా, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నిర్లక్ష్యానికి ఇది స్పష్టమైన ఉదాహరణ. కలుషిత నీటి వల్ల ప్రజలు మరణించడం యాదృచ్ఛికం కాదు, ఇది కేవలం పరిపాలనా లోపమూ కాదు. ఇది దీర్ఘకాలిక నిర్లక్ష్యం, దెబ్బతిన్న మౌలిక వసతులు, బాధ్యతారాహిత్యానికి నేరుగా వచ్చిన ఫలితం. తాగునీరు సురక్షితంగా అందించలేకపోతే, అది సంపూర్ణ పాలన వైఫల్యమే. ఈ అమానుష నిర్లక్ష్యాన్ని మహిళా కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. మృతుల కుటుంబాలకు తక్షణమే తగిన నష్టపరిహారం అందించాలి. బాధ్యులపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా శాశ్వతమైన, శాస్త్రీయమైన, సురక్షిత తాగునీటి వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయాలి. తాగునీరు కూడా హామీ ఇవ్వలేని ప్రభుత్వం అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కును కోల్పోయింది. కలుషిత నీటితో చనిపోయిన ప్రతి ప్రాణం పాలన వైఫల్యానికి ముద్ర వేసిన ఆరోపణే. దీనికి బాధ్యులైన వారిని ఎలాంటి ఆలస్యం లేకుండా జవాబుదారుల్ని చేయాలి.

# ప్రపంచ ఆర్థిక సదస్సుకు సిఎం రేవంత్

- జ్యూరిక్ చేరుకున్న రేవంత్‌కు ప్రవాసుల ఘనస్వాగతం



**హైదరాబాద్,జనవరి20 వెలుతురు:**
ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ చేరుకుంది. అక్కడి విమానాశ్రయంలో సీఎంకు ప్రవాస తెలంగాణ వాసులు ఘనస్వాగతం పలికారు. జ్యూరిక్ నుంచి రేవంత్ బృందం దావోస్‌కు వెళ్లనుంది. అక్కడ నాలుగురోజుల పాటు సమావేశాల్లో పాల్గొననుంది. వివిధ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ కానున్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' రోడ్ మ్యాప్‌తో పాటు రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలు, ప్రభుత్వ విధానాలను రేవంత్ వారికి వివరించనున్నారు. దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు-2026లో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం.. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా సీఎం ప్రతినిధి బృందానికి జ్యూరిక్ విమానాశ్రయంలో ప్రవాస తెలంగాణవాసులు ఘన స్వాగతం పలికారు. దావోస్ సదస్సులో మొదటి రోజు వివిధ రంగాలకు చెందిన కంపెనీల పారిశ్రామికవేత్తలతో జరిగే సమావేశంల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనున్నారు. తెలంగాణ రైజింగ్-2047 రోడ్ మ్యాప్‌ను ఈ ఆర్థిక సదస్సులో పారిశ్రామికవేత్తలకు ఈ సీఎం ప్రతినిధి బృందం వివరించనుంది. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలు, ప్రభుత్వ విధానాలు, పెట్టుబడులకున్న అనుకూలతలను వారికి వివరించడంపై సీఎం రేవంత్ ప్రతినిధి బృందం ఇప్పటికే దృష్టి సారించింది. గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన అభివృద్ధి నమూనాకు అనుగుణంగా సుస్థిర పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. దావోస్‌లో నాలుగు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు సీఎం రేవంత్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు వివిధ శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇక రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ఇప్పటికే దావోస్ చేరుకున్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరి వెళ్లారు. ఆ రోజు సాయంత్రం ములుగు జిల్లాలోని మేడారానికి చేరుకున్నారు. అనంతరం కేబినెట్ సమావేశం నిర్వహించారు. స్థానికంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. సోమవారం ఉదయం సమ్మక్క, సారలమ్మలను సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కుటుంబసభ్యులు, పలువురు మంత్రులు దర్శించుకుని.. మొక్కులు చెల్లించుకున్నారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకుని.. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు ప్రతినిధుల బృందం బయలుదేరి వెళ్లింది.

# విశ్రాంతి ఎరుగని పయనం..

## ప్రజాసేవలో మంత్రి జూపల్లి వినూత్న మార్కు!

- 48 గంటలు.. 1000 కిలోమీటర్ల 'మారథాన్' పర్యటన..!
- ఒకే రోజులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 4 జిల్లాల్లో సుడిగాలి పర్యటన
- అర్ధరాత్రి తర్వాత నిర్మల్ కలెక్టరేట్ (ఐడీఓసీ) రాష్ట్ర కార్యాలయంలో బస చేసిన మంత్రి జూపల్లి
- ఇవాళ ఉదయం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి
- అలుపెరగని అడుగు.. అభివృద్ధికి నిలువుటద్దం!



**మంచిర్యాల జిల్లా వెలుతురు జనవరి 20:**
రాజకీయాల్లో కొందరి శైలి ప్రత్యేకంగా ఉంటుంది.. మరికొందరి వేగం విలక్షణంగా ఉంటుంది. కానీ, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఈ రెండింటినీ మేళవించి తనదైన వినూత్న రీతిని ఆవిష్కరించారు. పాలనలో ఎప్పుడూ వినూత్న రీతిని అనుసరిస్తూ, తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకునే మంత్రి జూపల్లి కృష్ణారావు అలుపెరగని బాటసారిలా సాగించిన సుదీర్ఘ పర్యటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేవలం 48 గంటల కాల వ్యవధిలో సుమారు వెయ్యి కిలోమీటర్ల మేర సాగిన ఈ పయనం, క్షేత్రస్థాయిలో ఆయన పనితీరుకు ఉన్న నిబద్ధతను, 'మంత్రి మార్కు' వేగాన్ని మరోసారి చాటిచెప్పింది. ఆదివారం మధ్యాహ్నం భాగ్యనగరం నుంచి ప్రారంభమైన ఈ ప్రస్థానం, అడవి బిడ్డల ఆరాధ్య దైవం మేడారం సమ్మక్క-సారలమ్మ గడప వరకు సాగింది. అక్కడ జరిగిన మంత్రివర్గ సమావేశంలో చురుగ్గా పాల్గొన్న ఆయన, సోమవారం వేకువజామునే వనదేవతల ఆశీస్సులు పొంది, అటు నుంచి అటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పయనించారు. ఒక సుడిగాలిలా సాగిన ఈ పర్యటనలో భాగంగా మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చేరుకున్న ఆయన.. మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితం కాకుండా, సర్పంచుల పరిచయ కార్యక్రమంతో పాటు రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ వారిలో నూతనోత్సాహాన్ని నింపారు. అక్కడి నుంచి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్ నగర్, వాంకిడి, ఆసిఫాబాద్ ప్రాంతాల మీదుగా సాగిన ఆయన ప్రయాణం రికార్డు స్థాయి వేగంతో కొనసాగింది. వరుస అభివృద్ధి పనులు, శంకుస్థాపనలతో జిల్లా యంత్రాంగాన్ని ఉరుకులు పెట్టించిన ఆయన, అదే జోరులో అటు నుంచి అటే ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ చేరుకుని నాగోబా దేవాలయంలో పూజలు ముగించుకుని, రాత్రి 11 గంటల సమయంలో నిర్మల్ ఉత్సవాల వేదికపైకి చేరుకున్నారు. అర్ధరాత్రి వేళ కూడా ప్రజాసమక్షంలో ఉత్సాహంగా గడిపిన ఆయన, అర్ధరాత్రి ఒంటి గంటకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ (ఐడీఓసీ) రాష్ట్ర కార్యాలయంలో బస చేశారు. ఇలా తెలంగాణ రాష్ట్రంలో ఐడీఓసీ (సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం) రాష్ట్ర కార్యాలయంలో రెండు సార్లు బస చేసి రికార్డు సృష్టించారు మంత్రి జూపల్లి. కేవలం 48 గంటల కాలం.. ఉమ్మడి ఖమ్మం జిల్లా మినహా ఉత్తర తెలంగాణలో వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం.. మధ్యలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 4 జిల్లాలను ఒకే రోజు చుట్టివచ్చి .. వెరసి ఒక 'మారథాన్' పర్యటనతో ఆయన రాజకీయ క్షేత్రంలో రికార్డు సృష్టించారు. విశ్రాంతిని సైతం విస్మరించి, ప్రజల కోసం పరుగు తీయడమే తన నైజమని ఈ సుడిగాలి పర్యటన ద్వారా ఆయన మరోసారి నిరూపించారు. మంగళవారం ఉదయం రోడ్డు భద్రతా ఉత్సవాల్లో భాగంగా అరైవ్ అలైవ్" పేరిట నిర్వహించిన ప్రచారం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకీ షర్మిళ, ఇతర అధికారులతో కలిసి పాల్గొని పతంగులను ఎగురవేశారు. అనంతరం 9 గంటలకే మళ్లీ రోడ్డెక్కి మధ్యాహ్నం 12 గంటల కల్లా రాజధానికి చేరుకున్నారు. ఒకే రోజులో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నాలుగు జిల్లాలను సందర్శించి, అధికారిక బాధ్యతలను నెరవేరుస్తూనే పార్టీ పటిష్టతకు కృషి చేయడం ఆయన 'కార్యదక్షతసకు నిదర్శనం. ఈ 48 గంటల పర్యటన జూపల్లి అకుంఠిత దీక్షకు, ప్రజా సేవ పట్ల ఉన్న మక్కువకు ఒక సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది ఆసిఫాబాద్ వరకే కార్యక్రమాలను ముగించుకుని హైదరాబాద్ కు తిరుగు ప్రయాణం కావాల్సి ఉండగా.. ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ నాగోబా దర్శనం, అనంతరం అర్ధరాత్రి నిర్మల్ ఉత్సవాల్లో పాల్గొని, రాత్రి ఒంటి గంట తర్వాత ఐడీఓసీ కార్యాలయంలో బస చేయడం కొసమెరుపు.








# ఏఐ రంగంలో తెలంగాణతో భాగస్వామ్యానికి రాయల్ ఫిలిప్స్ ఆసక్తి

- హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటుపై చర్చ

**దావోస్ వెలుతురు జనవరి 20:**
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తెలంగాణతో భాగస్వామ్యమయ్యేందుకు ప్రముఖ హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ ఆసక్తి వ్యక్తం చూపింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై కూడా చర్చించేందుకు ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వేదిక2026 వార్షిక సమావేశాల్లో భాగంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ఫిలిప్స్ గ్లోబల్ నాయకత్వంతో భేటీ అయ్యారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ , గ్లోబల్ హెడ్ జాన్ విల్లెమ్ స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ.. ఏఐ రంగంలో తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత సేవలపై ప్రశంసలు కురిపించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'తెలంగాణ నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 20262030' గురించి ప్రతినిధి బృందం వివరించింది. 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మించడమే ఈ విధాన లక్ష్యమని, మెడికల్ ఎలక్ట్రానిక్స్ సహా అనుబంధ రంగాలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఔషధ తయారీ, పరిశోధనాభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగాల్లో ప్రపంచ స్థాయి, స్థిరమైన పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ (ORR) , రీజినల్ రింగ్ రోడ్ (RRR) మధ్యనున్న ప్రాంతంలో పెరిఅర్బన్ రీజియన్ ఎకానమీ (PURE) తయారీ, లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కొత్త లైఫ్ సైన్సెస్ విధానం, ఔషధ తయారీ వ్యూహాలు కలిసి తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు పునాది వేస్తాయని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, బలమైన ఐటీలైఫ్ సైన్సెస్‌హెల్త్ కేర్ టాలెంట్ బేస్, జీనోమ్ వ్యాలీ, 300 ఎకరాలకుపైగా విస్తరించిన మెడికల్ డివైసెస్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఉన్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ వైద్య పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఇక్కడి ఆస్పత్రులు ఇప్పటికే క్రిటికల్ కేర్, అంబులెన్స్ సేవలు వంటి రంగాల్లో ఏఐను సమర్థవంతంగా వినియోగిస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఏఐకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. "ఇదే సరైన సమయం. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయడానికి ఇది ఉత్తమ అవకాశమని" మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు వచ్చి.. జీనోమ్ వ్యాలీని సందర్శించాలని మంత్రి ఫిలిప్స్ నాయకత్వాన్ని ఆహ్వానించారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇప్పటికే మెడ్‌ట్రానిక్, ఒలంపస్, జీఈ వంటి అగ్రశ్రేణి సంస్థల ఎంబెడెడ్ ఇంజినీరింగ్, ఆర్ అండ్ డీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విల్లెమ్ స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో తెలంగాణ చేపడుతున్న ఏఐ ఆధారిత మార్పు అత్యంత ప్రశంసనీయమని అన్నారు. తమ నెదర్లాండ్స్ ప్రధాన కార్యాలయాన్ని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సందర్శించాలని ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు.






# సంపాదకీయం.. వరుస ఎన్నికలతో ఖజానాపై భారం !



ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు పండగే. అలాగే ఓటర్లకు కూడా పండగలాగే సాగుతోంది. ఓట్ల పండగ ఎప్పుడు జరుగుతందన్న భావనలో ఓటర్లు ఉన్నారు. ఇంటికి కనీసం ఓ పదివేలయినా దక్కుతాయని భావిస్తున్నారు. నిజానికి తెలంగాణలో పంచాయితీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఇటీవల పంచాయితీ ఎన్నికలను పూర్తి చేశారు. అయితే ఈ ఎన్నికలన్నీ ఒకేదఫా నిర్వహించి ఉంటే ఖజానాపై భారం తప్పేది. ప్రజలకు భారం తప్పేది. కానీ రాజకీయ పార్టీలకు ముఖ్యంగా అధికార పార్టీకి విడతలుగా ఎన్నికలు జరగడం ఇష్టం. జమిలిగా ఎన్నికలు జరిపితే తాము అనుకున్నట్లుగా ఫలితాలు రాకుంటే అభాసుపాలవుతారు. అందుకే తొలుత పంచాయితీ ఎన్నికలు నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. బహుశా ఈ ఫిబ్రవరిలో పంచాయితీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఆ తరవాత మార్చిలో జడ్పీ ఎన్నికలు జరగవచ్చు. ఇలా విడతలుగా ఎన్నికలు జరిగినా.. ఖజానా గుల్లయినా రాజకీయ పార్టీలకు వచ్చే నష్టం లేదు. ఆ నష్టమేదో ప్రజలు పన్నుల రూపంలో భరిస్తారు. ఇకపోతే ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు కావడంతో రానున్న వారం రోజుల్లో కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. వార్డులు, డివిజన్లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేయడంతో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా కసరత్తు చేస్తోంది. ఈక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ను హస్తగతం చేసుకునేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తోంది. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ క్యాండిడేట్లను గెలిపించుకునే బాధ్యతను మంత్రికి అప్పగించింది. ఒక్కో మంత్రిని ఇన్‌ఛార్జులుగా నియమించుకుంది. పార్లమెంట్ నియోజకవర్గానికో ఇన్‌చార్జీను నియమించింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు పార్టీ సింబల్ మీద జరగనుండడంతో అభ్యర్థుల ఎంపిక దగ్గరి నుంచి పోలింగ్ పూర్తయ్యేంత వరకు జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికల సమయంలో ఏ చిన్న పొరపాటు జరిగినా గెలుపోటములపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. దీంతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు వ్యూహారచనలో ఉన్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల పక్రియకు సంబంధించి ఒక కీలకమైన అడుగు పడింది. రాష్ట్ర మున్సిపల్ రిజర్వేషన్ల జాబితా ఖరారు కావడంతో, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ వివరాలను తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ జాబితాలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు , వార్డుల వారీగా కేటాయించిన రిజర్వేషన్లను స్పష్టంగా పొందుపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 116 మున్సిపాలిటీ లు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో ఉన్న 2,996 వార్డులు , డివిజన్లకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గం ఫిబ్రవరి నెలలో ఈ ఎన్నికల నిర్వహణకు ఆమోదాన్ని తెలిపింది. ప్రస్తుతం రిజర్వేషన్ల పక్రియ కూడా విజయవంతంగా పూర్తి కావడంతో, ఎన్నికల నిర్వహణకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏ క్షణంలోనైనా అధికారికంగా మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. అభ్యర్థులు , రాజకీయ పార్టీలు ఈ రిజర్వేషన్ల ఆధారంగా తమ ప్రచార వ్యూహాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్న మయ్యారు. ఇకపోతే ఇప్పటికే మున్సిపల్ చైర్మన్లు, వార్డుల రిజర్వేషన్లు ఖరారు కావడంతో పట్టణాల్లో ఎన్నికల వేడి ప్రారంభమైంది. ఇప్పటివరకు ఏ వార్డు ఎవరికి రిజర్వ్ అవుతుందోననే టెన్షన్‌తో ఉన్న ఆశావహులు రిజర్వేషన్లు ఖరారు కావడంతో టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

ఇక ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాలపై ఫోకస్ పెట్టాయి. వార్డుల వారీగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులు, వారి గెలుపోటములపై ప్రభావం చూపే అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులను సిద్ధం చేసుకుంటున్నారు. రాజకీయ పార్టీ లీడర్లు అభ్యర్థుల ఎంపికలో బిజీగా ఉన్నారు. యువ ఓటర్లకు గాలం వేసేందుకు వార్డుల్లో ఆశావహులు తమవంతు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఫిబ్రవరిలో పట్టణపోరు ప్రారంభం కానుంది. అందుకు అన్ని పార్టీలు కసరత్తులో ఉన్నాయి. గెలుపుపై ధీమాగానూ ఉన్నాయి. అయితే ప్రతి ఎన్నికల్లోనూ పార్టీలు గెలుస్తున్నాయి. ప్రజలు ఓడుతున్నారు. దీనిని వారు గుర్తించడం లేదు. డబ్బులు తీసుకుని ఓట్లు వేయడం పెరిగింది. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల్లో ఇది బయటపడింది. డబ్బులు తీసుకుని ఓట్లు వేయలేదని కొందరు అభ్యర్థులు తమ డబ్బులను వాపస్ ఇవ్వాలని నిలదీసారు. ఇలాంటి సంస్కృతి పోతే తప్ప నిజాయితీగా ఎన్నికలు సాగవు.

# ఎన్నికలప్పుడు బీసీ భజన.. అధికారానికి వచ్చాక బీసీ సీఎం అర్హత లేదన్న.. మూడు పార్టీల పాత్ర...!

తెలంగాణ రాజకీయాల్లో ఒక అసౌకర్యమైన కానీ తప్పించుకోలేని ప్రశ్న ఎప్పటికప్పుడు పైకి వస్తూనే ఉంటుంది - బీసీ ఓట్లు కావాలి కానీ బీసీ సీఎం ఎందుకు వద్దు ఈ ప్రశ్న ఏ ఒక్క పార్టీని ఉద్దేశించి వేసింది కాదు. కాంగ్రెస్ అయినా, బీఆరచవతీతీచస్ అయినా, బీజేపీ అయినా - అధికార రాజకీయాల మూల స్వభావాన్ని నిలదీసే ప్రశ్న ఇది. బహిరంగంగా ఎవ్వరూ ఒప్పుకోరు కానీ ఆచరణలో మాత్రం మూడు పార్టీలూ ఒకే లైన్‌లో నడుస్తున్నాయి. బీసీలు ఓటు బ్యాంక్‌గా ఉండాలి, కానీ అధికారం దక్కే స్థాయికి మాత్రం ఎదగకూడదు.



**మన్నారం నాగరాజు.**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

తెలంగాణ సమాజ నిర్మాణాన్ని చూస్తే ఈ రాజకీయ ద్వంద్వత్వం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. రైతు పొలాల్లో చెమటోడ్చేది బీసీ. పట్టణాల్లో కూలి పని చేసేది బీసీ. సంప్రదాయ వృత్తులు మోస్తున్నది బీసీ. కళలు, సంస్కృతి, జానపదత్వం నిలబెట్టింది బీసీ. అంతిమంగా ఎన్నికల వేళ బూత్?ల వద్ద క్యూలో నిల్చొని ఓటు వేసేది కూడా బీసీయే. కానీ ఆ ఓటుతో ఏర్పడే ప్రభుత్వానికి నాయకత్వం వహించే అర్హత మాత్రం బీసీకి లేదన్న అఘోషిత నిర్ణయం ఎప్పటినుంచో అమల్లో ఉంది.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ ప్రశ్న మరింత గట్టిగా వినిపించాల్సి ఉంది. ఎందుకంటే ఇది ప్రత్యేక రాష్ట్రం. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, ఆర్థిక సమానత్వం అనే నినాదాలతో ఏర్పడిన రాష్ట్రం. అలాంటి రాష్ట్రంలో బీసీ సీఎం అనే ఆలోచనే రాజకీయంగా అసాధ్యంగా ఎందుకు మారింది? ఇది యాదృచ్ఛికం కాదు. ఇది ఉద్దేశపూర్వక రాజకీయ నిర్మాణం.

కాంగ్రెస్ పార్టీ రాజకీయ చరిత్రలో "సామాజిక న్యాయం" అనే పదం ఒక నినాదంగా, ఒక సిద్ధాంతంగా పదే పదే వినిపిస్తుంది. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ తనను తాను అణగారిన వర్గాల పక్షపాతిగా చిత్రీకరిస్తూ వచ్చింది. దేశవ్యాప్తంగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు తమ ఓటు బలాన్ని ఎక్కువగా కాంగ్రెస్?కే కేటాయించిన సందర్భాలు అనేకం. తెలంగాణలోనూ అదే సామాజిక సమీకరణ కనిపిస్తుంది. కానీ అధికార కేంద్రానికి చేరుకున్న తర్వాత కాంగ్రెస్ వైఖరి చూస్తే, సామాజిక న్యాయం ఒక ఆచరణగా కాకుండా కేవలం రాజకీయ బ్రాండ్?లా మిగిలిపోతుందన్న విమర్శలకు బలం చేకూరుతోంది.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు మంత్రివర్గంలో కొన్ని స్థానాలు ఇవ్వడం, కార్పొరేషన్ పదవులు కేటాయించడం ద్వారా తన బాధ్యత ముగిసిందన్న భావనలో ఉన్నట్టు కనిపిస్తోంది. ఇవన్నీ అవసరమే కానీ, ఇవే సామాజిక న్యాయం అన్నట్టుగా కాంగ్రెస్ వ్యవహరిస్తే ప్రశ్నలు తలెత్తడం సహజం. ముఖ్యమంత్రి పదవి విషయానికి వచ్చేసరికి మాత్రం "అందరికీ కాదు" అన్నట్టుగా ఒక గోప్యమైన గీత గీసినట్లు అనిపిస్తోంది. బీసీ వర్గాలకు చెందిన నాయకులు సామర్థ్యం లేనివారా? పరిపాలనా నైపుణ్యం లేదా రాజకీయ అనుభవం తక్కువవారా? అనే ప్రశ్నలు కాదు ఇవి. అసలు ప్రశ్న కాంగ్రెస్ నాయకత్వంలోని రాజకీయ సంకుచితత్వం గురించిందే.


బీసీలు జనాభాలో పెద్ద శాతంగా ఉన్నప్పటికీ, వారి రాజకీయ భాగస్వామ్యం అత్యున్నత స్థాయిలో ఎందుకు నిరాకరించబడుతోంది? సీఎం పదవి అనేది కేవలం ఒక వ్యక్తికి దక్కే అధికారం మాత్రమే కాదు, అది ఒక సామాజిక వర్గానికి గౌరవం, గుర్తింపు, నమ్మకం. ఆ స్థాయిలో బీసీలను కాంగ్రెస్ నమ్మకపోవడం, లేదా నమ్మకపోతున్నట్టు కనిపించడం, పార్టీ ప్రకటించే సామాజిక న్యాయ సిద్ధాంతానికి పూర్తి విరుద్ధం. ఇదే సమయంలో రాహుల్ గాంధీ పార్లమెంట్లో రాజ్యాంగాన్ని చేతబట్టి నిలబడి, "ప్రతి పౌరుడికి సమాన హక్కులు", "సామాజిక న్యాయం", "అణగారిన వర్గాలకు సాధికారత" అని పిలుపునివ్వడం రాజకీయంగా బలమైన సందేశమే. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్రలు చేసి ప్రజల బాధలను తెలుసుకున్న నాయకుడిగా రాహుల్ గాంధీకి ఒక ప్రత్యేకమైన విశ్వసనీయత ఉంది. కానీ అదే నాయకత్వం కింద తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రిని ఎందుకు ఊహించలేకపోతోంది అన్న ప్రశ్న ఇప్పుడు మేధావులు, పలు సంఘాలు బహిరంగంగా లేవనెత్తుతున్నాయి.

సామాజిక న్యాయం అనేది ప్రసంగాల్లో చెప్పే మాటలతో కాదు, అధికారంలో అమలు చేసే నిర్ణయాలతో కొలవబడుతుంది. బీసీలకు మంత్రివర్గంలో చోటు ఇవ్వడం ఒక మెట్టు అయితే, సీఎం పదవికి అవకాశం ఇవ్వడం మరో పెద్ద మెట్టు. ఆ మెట్టును ఎక్కే ధైర్యం కాంగ్రెస్?కు ఎందుకు రావడం లేదు? ఈ సందేహం బీసీ వర్గాల్లో అసంతృప్తిని పెంచుతోంది. ఓటు బ్యాంక్?గా మాత్రమే తమను చూసి, అధికార భాగస్వాములుగా చూడడం లేదన్న భావన బలపడుతోంది.

కాంగ్రెస్ నిజంగా సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటే, అది మాటల్లో కాదు, కార్యాచరణలో కనిపించాలి. బీసీ సీఎం అనేది ఒక వ్యక్తి కోసమో, ఒక పదవి కోసమో కాదు, అది కోట్లాది బీసీ ప్రజలకు ఒక రాజకీయ సంకేతం. ఆ సంకేతాన్ని ఇవ్వడంలో కాంగ్రెస్ వెనుకడుగు వేస్తే, "సామాజిక న్యాయం" అన్న పదం కాంగ్రెస్ బ్రాండ్?కే పరిమితమవుతుందన్న విమర్శను తిప్పికొట్టడం కష్టమే. ఇప్పుడు కాంగ్రెస్ ముందు ఉన్న సవాలు ఇదే - ప్రకటనలు కాదు, నిర్ణయాల ద్వారా సామాజిక న్యాయాన్ని నిరూపించడం. ఇక బీఆరచవతీతీచస్ పరిస్థితి ఇంకా విచారకరం. తెలంగాణ ఉద్యమంలో బీసీల పాత్ర చరిత్రాత్మకం. గ్రామ గ్రామాన ఉద్యమాన్ని మోసింది బీసీ వర్గాలే. కానీ రాష్ట్రం వచ్చాక పదేళ్ల పాలనలో అధికారం ఒక కుటుంబం, ఒక సామాజిక వర్గం చుట్టూ తిరిగింది. బీసీ సీఎం అనే మాటను వినడమే అసహ్యంగా భావించిన పరిస్థితి అది. ఉద్యమం కోసం బీసీలను ఉపయోగించుకున్నారు, పాలనలో మాత్రం పక్కన పెట్టేశారు. ఇది రాజకీయ మోసం కాక మరేమిటి?బీజేపీ విషయానికి వస్తే, దేశంలో బీసీ రాజకీయాలను మేం పెంచామంటూ గొప్పగా చెప్పుకుంటుంది. ప్రధాని స్థాయి ఉదాహరణలు చూపిస్తుంది. కానీ తెలంగాణలో మాత్రం ఆ ధైర్యం కనిపించదు. బీసీలను పార్టీ విస్తరణకు వాడుకుంటుంది, కానీ అధికార ముఖచిత్రంగా నిలబెట్టే సాహసం చేయదు. కేంద్రంలో ఒకటి, రాష్ట్రంలో మరోటి అన్న ద్వంద్వ విధానం బీజేపీని బీసీల దృష్టిలో అనమ్మకమైనదిగా మారుస్తోంది.

ఇక్కడ అసలు ప్రశ్న వ్యక్తుల గురించి కాదు. బీసీ నాయకులు లేరా? ఉన్నారు. సామర్థ్యం లేరా? ఉంది. అనుభవం లేరా? బీసీ సీఎం చేస్తామని కూడా అనరు,మరి ఎందుకు సీఎం కావడం లేదు? కారణం స్పష్టం -- బీసీలు అధికారం అందుకుంటే రాజకీయ సమీకరణాలు మారిపోతాయి. శతాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక-రాజకీయ ఆధిపత్యానికి అది ప్రమాదం. అందుకే బీసీ సీఎం అనే ఆలోచనను మొదట్లోనే అణిచివేస్తున్నారు. ఈ పరిస్థితికి కొంతవరకు బీసీల మౌనం కూడా కారణమే. విడిపోయిన కులాలు, ఉపకులాలుగా ఉండటం వల్ల ఒకే రాజకీయ డిమాండ్?పై ఏకమవడం జరగలేదు. చిన్న చిన్న లాభాలకు లొంగిపోయి పెద్ద లక్ష్యాన్ని వదిలేసిన సందర్భాలు ఎన్నో. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. కులగణన, రాజకీయ ప్రాతినిధ్యం, అధికారం అనే అంశాలు బహిరంగ చర్చలోకి వస్తున్నాయి. ఇది శుభపరిణామం.బీసీ సీఎం అనే డిమాండ్ ఎలాంటి అతిశయోక్తి కాదు. అది రాజ్యాంగ విరుద్ధమూ కాదు. అది కేవలం ఒక వర్గం అధికారం కోరడం కాదు -- ప్రజాస్వామ్యంలో సమాన అవకాశాల డిమాండ్. ఒక రాష్ట్ర జనాభాలో పెద్ద శాతం ఉన్న వర్గానికి అత్యున్నత రాజకీయ పదవి దక్కకపోవడం నిజంగా ప్రజాస్వామ్య వైఫల్యమే. ఇప్పటికీ బీసీలు మౌనంగా ఉంటే, రేపు కూడా రాజకీయ పార్టీలు ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తాయి. ప్రశ్నించని వర్గాన్ని ఎవరూ గౌరవించరు. ఓటు హక్కును ఒక సాధనంగా మార్చుకుని, స్పష్టమైన రాజకీయ డిమాండ్?తో ముందుకు రాకపోతే చరిత్ర తిరగబడదు.ఇది కేవలం ఒక రాజకీయ వ్యాఖ్య కాదు , తెలంగాణ రాజకీయాల్లో మరిగిపోతున్న లోతైన అసంతృప్తికి ప్రతిబింబం. ఇప్పటివరకు ఎన్నికల సమయంలో మాత్రమే బీసీలను గుర్తుచేసుకుని, ఓట్లు వచ్చాక పక్కకు నెట్టేసే రాజకీయ ధోరణి ఇక కొనసాగదు అనే స్పష్టమైన సంకేతం ఇది. బీసీలు సంఖ్యలో ఎక్కువగా ఉన్నారు అనే నిజాన్ని రాజకీయ పార్టీలు ఎప్పుడో అంగీకరించాయి. కానీ అదే బీసీలు పాలించగలరా? ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోగలరా? అనే ప్రశ్న వచ్చేసరికి మాత్రం మౌనం, మాయమాటలు, తప్పించుకునే వ్యూహాలు కనిపిస్తున్నాయి. ఇదే అసలు సమస్య.తెలంగాణలో బీసీలు కేవలం ఓటర్లుగా కాదు -- రైతులుగా, కార్మికులుగా, చిన్న వ్యాపారులుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా, సమాజాన్ని నడిపిస్తున్న ప్రధాన శక్తిగా ఉన్నారు. అలాంటి వర్గానికి రాజకీయ అధికారంలో నిజమైన భాగస్వామ్యం లేకపోవడం అన్యాయం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంపై మోసమూ. "బీసీ ఓట్లు కావాలి కానీ బీసీ సీఎం వద్దు" అనే ఆలోచన రాజకీయ చరిత్రలో ఎంతకాలం నడిచినా, ఇకపై అది నిలబడే పరిస్థితి లేదు. కాంగ్రెస్, బీఆరచవతీతీచస్, బీజేపీ - ఈ మూడు పార్టీలూ బీసీల గురించి మాట్లాడతాయి. హామీలు ఇస్తాయి. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, కార్పొరేషన్ పదవులు చూపిస్తాయి, గొర్రెలు, బర్రెలు, పందులను, చేపలు, ఆవులను పెంచుకోమని చెప్తారు,కానీ నిర్ణయాత్మక అధికారం ఇచ్చే విషయంలో మాత్రం వెనుకడుగు వేస్తాయి. అసలు ప్రశ్న ఇదే.బీసీ నాయకుడు పార్టీకి ఓట్లు తెస్తే సరిపోతుందా? లేక రాష్ట్రాన్ని నడిపించే నైపుణ్యం, సామర్థ్యం కూడా ఆయనకే ఉందని ఒప్పుకోవాలా? ఈ నిజాన్ని ఏ పార్టీ ముందుగా అంగీకరిస్తుందో, తెలంగాణ రాజకీయాల్లో భవిష్యత్తు వారిదే.






ఇక బీసీల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. సోషల్ మీడియా, విద్య, ఉద్యమాల ద్వారా ప్రశ్నించే తత్వం పెరుగుతోంది. "ఎందుకు మాకు సీఎం పదవి వద్దు?" అనే ప్రశ్న ఇప్పుడు గట్టిగా వినిపిస్తోంది. ఇది ఎవరినైనా భయపెట్టడానికి కాదు, సమానత్వాన్ని కోరే సహజమైన డిమాండ్. దీన్ని నిర్లక్ష్యం చేస్తే, రేపు ఇది కేవలం రాజకీయ ప్రశ్నగా కాకుండా సామాజిక అశాంతిగా మారే ప్రమాదం ఉంది. చరిత్ర చెబుతోంది, న్యాయమైన వాటా నిరాకరించబడిన ప్రతీసారి సమాజం మౌనంగా ఉండలేదు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కూడా ఇదే భావనతో నడిచింది, "మన పాలన మన చేతుల్లో ఉండాలి." ఆ ఆశయం ఇప్పుడు సగం వరకు మాత్రమే నెరవేరిందని బీసీలు భావిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడింది కానీ అధికార నిర్మాణంలో పాత సామాజిక అసమానతలు అలాగే కొనసాగుతున్నాయి. ఇది తెలంగాణ ఆత్మకు విరుద్ధం. నిజమైన తెలంగాణ అంటే అన్ని వర్గాలకు -- ముఖ్యంగా మెజారిటీగా ఉన్న బీసీలకు -- రాజకీయ నిర్ణయాధికారంలో సముచిత స్థానం కల్పించడమే. ఇక పార్టీలకు ఎంపిక స్పష్టంగా ఉంది. బీసీలను ఓటు బ్యాంక్?గా మాత్రమే చూడాలా? లేక పాలనలో భాగస్వాములుగా గుర్తించాలా? ఈ నిర్ణయం రాబోయే ఎన్నికల్లో మాత్రమే కాదు, తెలంగాణ రాజకీయాల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. బీసీల్లో ఉన్న అసహనం, ఆగ్రహం, ఆశ -- ఇవన్నీ కలసి ఒక కొత్త రాజకీయ దిశను రూపొందిస్తున్నాయి. దీన్ని అర్థం చేసుకుని ముందుకు నడిచే పార్టీకి ప్రజల మద్దతు లభిస్తుంది. లెక్కచేయని పార్టీలు మాత్రం చరిత్ర పుస్తకాలలో "అవకాశం ఉన్నా ఉపయోగించుకోలేని శక్తులు"గా మిగిలిపోతాయి.

అందుకే స్పష్టంగా చెప్పాల్సిందే - ఇక ప్రశ్న ఓటు ఎవరికి కాదు. అధికారం ఎవరిది అన్నదే అసలు ప్రశ్న. బీసీలు పాలించడానికి అర్హులు మాత్రమే కాదు, సిద్ధంగా కూడా ఉన్నారు. ఈ నిజాన్ని అంగీకరించడం రాజకీయ దయ కాదు - ప్రజాస్వామ్యానికి తప్పనిసరి న్యాయం చేయాల్సిన బాధ్యత పార్టీలపై ఉందనేది గుర్తు ఎరగాలి.

# ఘనంగా వికీపీడియా 25వ వార్షికోత్సవ వేడుకలు





**హైదరాబాద్ వెలుతురు జనవరి 20:**
ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఉచితంగా జ్ఞానం అందించాలి అనే లక్ష్యంతో 2001 జనవరిలో వికీపీడియా ప్రారంభమై 2026 జనవరి నాటికి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గచ్చిబౌలి ట్రిపుల్ఐటీ - హైదరాబాద్‌లోని కోహ్లి రీసెర్చ్ బ్లాక్ (కేఆర్‌బీ) ఆడిటోరియంలో ఓపెన్ నాలెడ్జ్ ఇనీషియేటివ్స్ టీమ్ ఆధ్వర్యంలో ‘హైదరాబాద్ సెలెబ్రేట్స్ వికీపీడియా‘ పేరిట 25వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వికీపీడియా సహ వ్యవస్థాపకుడు జిమ్మీ వేల్స్, ఐఐఐటీ ప్రొఫెసర్ వాసుదేవ వర్మలు వికీపీడియా చేస్తున్న కార్యక్రమాలపై వారి సందేశాలిచ్చి



వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వికీమీడియన్ ఆఫ్ ద ఇయర్ ఆనరబుల్ మెన్షన్ పురస్కారం పొందిన భారతీయ వికీమీడియన్ నితేష్ గిల్ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రముఖ భారతీయ వికీమీడియన్ తన్వీర్ హాసన్ వికీపీడియా 25వ జన్మదినం సందర్భంగా ఈ ప్రాజెక్టుకు తాను రాసిన లేఖను వినిపించారు. “వికీమీడియా ఇన్ హైదరాబాద్: ఎ జర్నీ ఆఫ్ ఓపెన్ నాలెడ్జ్“ పేరిట ఓపెన్ నాలెడ్జ్ ఇనీషియేటివ్స్ ప్రోగ్రామ్ మేనేజర్ పవన్ సంతోష్ రూపొందించిన డాక్యుమెంటరీలో నగరంలోని గోల్డెన్ థ్రెషోల్డ్ (అబిడ్స్), రవీంద్రభారతి, ఐఐఐటీ హైదరాబాద్ ఎలా వికీపీడియా కార్యకలాపాలకు కేంద్రం కావడం, అంతర్జాతీయ స్థాయిలో వికీమీడియా టెక్నాలజీ సమ్మిట్, జాతీయ స్థాయిలో వికీకాన్ఫరెన్స్ ఇండియా వంటి కార్యక్రమాలు ఇక్కడ నిర్వహించడం వంటివి ప్రదర్శించారు. వికీమీడియన్స్ యర్రా రామారావు, విజె సుశీల, ప్రొ. రాధికా మామిడి, డాక్టర్ రాజశేఖర్, బత్తిని వినయ్ కుమార్ గౌడ్, ప్రణయ్ రాజ్ వంగరిలు ఈ కార్యక్రమంలో సందేశం వినిపించారు. అనంతరం పబ్లిక్ డొమైన్ దినోత్సవాన్ని నిర్వహించి, వికీపీడియా 25వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. తాము రూపొందించిన భారతీయ వికీమీడియాల డాష్‌బోర్డును నివాస్ రామిశెట్టి, కృష్ణచైతన్య వెలగా విడుదల చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ వికీపీడియా ద్వారా ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో, అలాగే ఇక్కడ తెలుగు వికీపీడియా మాతృభాషలో సమాచారం అందడం సంస్కృతి పరిరక్షణకు తోడ్పడుతోందని, స్వచ్ఛంద వాలంటీర్స్ అంత కలిసి నిర్మించిన ఒక విశిష్ట విజ్ఞాన వేదికగా నిలిచిందని వక్తలు అన్నారు. మాతృభాషలో జ్ఞానం అందించే ఈ వేదిక తెలుగు సంస్కృతిని పరిరక్షించడంలో, విలువైన సమాచారాన్ని భవిష్యత్ తరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేఐ (OKI) నిర్వాహకులు పవన్ సంతోష్, తన్వీర్, నితీష్ గిల్, నివాస్, కృపాల్ కశ్యప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ వైద్య కళాశాలలో కన్వీనర్ కోటా ఫీజులు పెంచాలనే ఆలోచనను విరమించుకోవాలి

**- కన్వీనర్ కోటా ఎత్తివేసే ఆలోచనను విరమించుకోవాలి**

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు జనవరి 20:**
ప్రవేట్ వైద్య కళాశాలలో కన్వీనర్ కోటా ఫీజులు పెంచితే ఊరుకునేది లేదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ హెచ్చరించారు. కన్వీనర్ కోటా ఫీజు ““బీ“ (యాజమాన్య కోట) కేటగిరీకి ఒకే ఫీజు ఉండాలనీ ప్రవేట్ మెడికల్ కాలేజీలు కోరడం వారి ధన దాహనానికి నిదర్శనమన్నారు.కాలేజీలలో ఏలాంటి మౌళిక సదుపాయాలు లేకున్న అరకొర వసతులతో కోట్ల రూపాయలు సంపాదిస్తున్న ప్రవేట్ మెడికల్ కాలేజీలు కన్వీనర్ కోటా సీట్లను తొలగించడం ద్వారా వైద్య విద్యను డబ్బులున్న వారికి, సంపన్నులకే పరిమితం చేయాలని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. కన్వీనర్ కోటా సీట్లు గ్రామీణ, పేద , మధ్య తరగతి, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అనుకూలంగా ఉండేదని,లాభాపేక్ష లక్ష్యంగా ప్రైవేట్ మెడికల్ కాలేజీల అసోసియేషన్ చేస్తున్న ఆలోచనలు దుర్మార్గమైనవని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.


# హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉంది

**- అఖిల భారత హిందూ మహాసభ జాతీయ అధ్యక్షురాలు రాజశ్రీ చౌదరి**



**వెలుతురు, హైదరాబాద్ జనవరి 20 :**
దేశవ్యాప్తంగా హిందూ ధర్మాన్ని రక్షిస్తూ హిందుత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని అఖిల భారత హిందూ మహాసభ జాతీయ అధ్య క్షురాలు రాజశ్రీ చౌదరి అన్నారు. దక్షిణ భారత సనాతన ధర్మ యా త్రలో భాగంగా నిర్వహిస్తున్న సనాతన ధర్మరక్షణపునరుద్ధరణ యా త్ర సందర్భంగా రాజశ్రీ చౌదరిని ప లువురు ప్రముఖులు మర్యాదపూ ర్వకంగా కలిశారు. హైదరాబాదు జంటనగరాలలోని హిందూ ధర్మ పరిరక్షణ సంస్థలో..అఖిల భారత హిందూ మహాసభ తెలంగాణ ప్రాం త అధ్యక్షులు గడ్డ మీది కళ్యాణ్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం అ ధ్యక్షులు పల్లె లక్ష్మణరావు, నేష నల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.అనురాధ, ఆదర్శ కిరణం బీసీల మాసపత్రిక ప్రధాన సంపాదకులు వంగాల బా లరాజ్, వసంత్ కుమార్, ఆనంద్ తదితరులు ఆమెను కలిసి శాలువ తో సన్మానించి పూల బొక్కే అంద జేసి శుభాకాంక్షలు తెలిపారు. అ నంతరం రాజశ్రీ చౌదరి మాట్లాడా రు. నేటి యువత సనాతన ధర్మ విలువలను అవగాహన చేసుకొ ని, హిందూ సంస్కృతి పరిరక్షణలో చురుకుగా పాల్గొనాలన్నారు. అదే విధంగా యువత మత్తుకు, మాద క ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు.

# పీర్జాదిగూడలో అక్రమ నిర్మాణాల జోరు..!



**- ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో ఎసరు.**

**- అడ్డదారిలో భారీ షెడ్ నిర్మాణం.**

**- చర్యలకు జంకుతున్న అధికారులు.**

**- నేతల ఒత్తిడిలే కారణమా..**




**మేడిపల్లి వెలుతురు,జనవరి 20:**
బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ లో ఏలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ షెడ్ నిర్మాణంపై చర్యలు చేపట్టడానికి అధికారులు ససేమిరా అంటున్నారు.ఈ భారీ షెడ్ నిర్మాణం అనుమతులకు విరుద్ధంగా చేపట్టారు.దీనితో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కాస్తా ప్రయివేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్తుంది.దీనివలన ప్రజలకు అందాల్సిన మౌలిక సదుపాయాలు ఏలా అందుతాయి.నేతల ఒత్తిడి కారణంగా,అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి అనే విమర్శలున్నాయి.ఇప్పటికైన అధికారులు వెంటనే స్పందించి ఈ భారీ షెడ్ నిర్మాణంపై దర్యాప్తు జరిపి,శాఖాపరమైన చర్యలు చేపట్టాలి.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం

**: నాయినేని చంద్రకాంత్ రావు**



**కూకట్ పల్లి జనవరి 20 వెలుతురు:**
శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్‌లో ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నానని నాయినేని చంద్రకాంత్ రావు స్పష్టం చేశారు. మంగళవారం రామకృష్ణ నగర్, ఆర్.పి కాలనీల్లో కమిటీ పెద్దలతో కలిసి పలు వీధులలో పాదయాత్ర నిర్వహించి, స్థానికుల నుంచి ప్రత్యక్షంగా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న తాగునీటి, డ్రైనేజీ, రహదారులు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులపై ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయినేని చంద్రకాంత్ రావు అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, అవసరమైతే అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి అయినా సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడతానని నాయినేని చంద్రకాంత్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, రామకృష్ణ నగర్ ప్రెసిడెంట్ మధు, ఆర్.పి కాలనీ జనరల్ సెక్రటరీ అల్వాల భాస్కర్, రామకృష్ణ నగర్ జనరల్ సెక్రటరీ మధు, రామకృష్ణ నగర్ కాంటెస్టెడ్ ప్రెసిడెంట్ యూసుఫ్, కచ్చిగళ్ల రమేష్, దుర్గారావు, యాదగిరి, భూషి, ఎం. హనుమంతు, మందుల నాగరాజు, రవీందర్, రాధాబాయ్, లక్ష్మి, కవిత, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం తోనే అభివృద్ధి లక్ష్యం

**- ఖాజా నగర్ కాలనీ సమస్యలపై కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ పాదయాత్ర..**



**కూకట్ పల్లి జనవరి 20 వెలుతురు:**
అల్విన్ కాలనీ డివిజన్, ఎల్లమ్మ బండ పరిధిలోని ఖాజా నగర్ కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.హెచ్.ఎం.సి అధికారులు, కాలనీ వాసులతో కలిసి మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని వీధుల వెంట తిరుగుతూ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, ఖాజా నగర్ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లకు సంబంధించిన పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ పనులను శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని త్వరలోనే శాంక్షన్ చేయించి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచె పనులు అవసరమని కాలనీ వాసులు తెలియజేయగా, కార్పొరేటర్, సంబంధిత విద్యుత్ అధికారులను ఆదేశించి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి, కాలనీలో అసంపూర్తిగా మిగిలిన పనులన్నింటినీ త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కాలనీ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తామని, అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు. అలాగే కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజల సమిష్టి కృషితో ఖాజా నగర్ కాలనీని ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.హెచ్.ఎం.సి అధికారులు ఎ.ఈ. యుగంధర్ రెడ్డి, ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవికుమార్, ఎంటమాలజీ సూపర్వైజర్ డి. నరసింహులు, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ శివ, ఎస్.ఎఫ్.ఎ వెంకటరెడ్డి, సిబ్బంది, నాయకులు సమ్మారెడ్డి, గోపాల్, షౌకత్ అలీ మున్నా, కైసర్, ఖాజా, సుల్తాన్, ఫిరోజ్, ఎం.డి. గౌస్, ఎస్.కె. గౌస్, మెహబూబ్, నవాజ్, అక్బర్, లింగం, సుధాకర్, సత్తయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన ఎస్ఈ లక్ష్మీనారాయణ




**మంచాల వెలుతురు జనవరి 20:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటి తెలంగాణ పబ్లిక్ పాఠశాల ఆరుట్ల గ్రామంలో ప్రవేట్ పాఠశాలలకు అనుగుణంగా అన్ని అంగులతో ప్రవేట్ పాఠశాలలను తలదన్నేలాఅన్ని వసతులతో తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే మంగళవారం రోజు ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన ఎస్ ఈ లక్ష్మీనారాయణ పాఠశాలలో విద్యుత్ పనులను దగ్గరుండి పరిశీలించడం జరిగింది భోజనశాల దగ్గర వంటగది దగ్గర షెడ్ దగ్గర అడ్డుగా వస్తున్న కరెంటు తీగలను తొలగించి ప్రత్యే కంగా ఒక స్తంబాన్ని ఏర్పాటు చేయడం జరి గింది. పాఠశాలకు ప్రత్యే కంగాఒక ట్రాన్స్ఫార్మర్ ని ఏర్పాటు చేస్తామన్నారుఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ పాపిరెడ్డి ఏఎస్ డీఎంసి కమిటీ సభ్యులు కంబాలపల్లి భాస్కర్ ఉపాధ్యా యులు జహీర్ అజాద్ విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ అవినాష్ రెడ్డిని కలిసిన మంచాల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గ రాములు ముదిరాజ్



**మంచాల వెలుతురు జనవరి 20:**
మంచాల మండలం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ అవినాష్ రెడ్డిని నగరంలోని తన నివాసంలో మర్యాద పూర్వకంగాకలిసిన మంచాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గరాములు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకుడు మారగోని రాజ య్యగౌడ్ ఈ సందర్భంగా తెలంగా ణ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు మాట్లాడుతూ కిషన్ సెల్ మండల అధ్యక్షులు రైతుల పక్షాన ఉండి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు రైతులకు వివరించి రైతులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి రైతులకు ఎల్లప్పుడూ కిసాన్ సెల్ నాయకులు అండగా ఉండాలని అన్నారు కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారందరికీ రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుంది ఎవ్వరు నిరాశ చెందవద్దుఅని అన్నారు

# ఘనంగా జాతీయ భద్రత సలహాదారుడు అజిత్ దోవల్ గారి 81 వ జన్మదిన వేడుకలు

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 20 :**
నారాయణఖేడ్ పట్టణంలో ప్రముఖ సామాజిక సేవకర్త ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్



కౌన్సిల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో జాతీయ భద్రత సలహాదారుడు అజిత్ దోవల్ గారి 81 వ జన్మదినం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్ ఓం ప్రకాష్ మాట్లాడుతూ దోవల్ జి దేశానికి చేసిన సేవలను గురించి కొనియాడారు ఈ కార్యక్రమంలో గొందే గావ్ మాజీ సర్పంచ్ శాంతయ్య స్వామి,సంతోష్ సార్, రాజు గౌడ్, బోయిని శ్రీనివాస్,అశోక్ రెడ్డి, విటల్, మహేష్, రవి యాదవ్, దిలీప్,శ్రీనివాస్, పండరి రెడ్డి, వివేకానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

## చెరువుగట్టు జాతర ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ - శివరాం రెడ్డి






**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 20:** నార్కట్ పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలో శ్రీ శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన తేదీ 20-01-2026 న చెరువుగట్టు బ్రహ్మోత్సవాల సందర్భంగా నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి నల్లగొండ టూ టౌన్ సీఐ రాఘవరావు , చండూర్ సీఐ ఆది రెడ్డి నార్కట్‌పల్లి సీఐ కె. నాగరాజు , ఎస్సై పి. విష్ణుమూర్తి కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చెరువుగట్టు దేవస్థానం ఈవో , ఏఈ వారి సిబ్బంది మరియు జాతరకు సంబంధించిన కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

## మర్రి లింగస్వామి కి సన్మానం

**- జాల మంజుల సైదులు**



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 20:** నార్కెట్ పల్లి పట్టణానికి చెందిన మర్రి లింగస్వామికి చెరువుగట్టు శ్రీ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త గా ఎన్నికైన సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు తెలిపిన జాల మంజుల-సైదులు యాదవ్ ఈ కార్యక్రమం లో మాజీ వార్డ్ సభ్యులు బొబ్బలి దేవేందర్,బొబ్బలి మల్లేశం ,నడిశీపల్లి వెంకన్న ,దాసరి ముత్తయ ,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెరువుగట్టు హుండీ లెక్కింపు





**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 20:** తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా లో సుప్రసిద్ధ శైవ క్షేత్రంగా ప్రతి నిత్యం భక్తులతో కిక్కిరిస్తున్న నార్కట్పల్లి మండలం చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపును మంగళవారం దేవాదాయ శాక పరిశీలకురాలు సుమతి, దేవాలయ కార్యనిర్వహణ అధికారి ఎస్ మోహన్ బాబు ల సమక్షంలో నిర్వహించారు. గట్టు కింద ఆలయ హుండీ లో అమ్మవారికి భక్తులు సమర్పించిన నగదు 3,85,695/- రూపాయలు. అదేవిధంగా గట్టుపైన స్వామివారికి భక్తులు సమర్పించిన నగదు 28,98,762/- రూపాయలు గత 52 రోజులుగా స్వామి అమ్మవార్లకు భక్తులు సమర్పించిన మొత్తం 32,84,457/- రూపాయలు వచ్చినట్లు ఈవో మోహన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో నందిగామ కు చెందిన శ్రీ దుర్గా శివ సాయి సేవా సమితి సభ్యులు, హెచ్ డి ఎఫ్ సి నల్లగొండ బ్రాంచ్ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జాతీయ అధ్యక్షులుగా నితిన్ నబీన్ నియమితులైన సందర్భంగా చౌటుప్పల్ బిజెపి శ్రేణుల సంబరాలు...

**చౌటుప్పల్ వెలుతురు జనవరి 20:** భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ, రూరల్ శాఖ ల ఆధ్వర్యంలో మంగళవారం రోజున భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులుగా నితిన్ నబీన్ నియమితులైన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, చౌటుప్పల్ బిజెపి శ్రేణులు సంబరాలు నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని బస్టాండ్ దగ్గర బిజెపి శ్రేణులు జైశ్రీరామ్ నినాదంతో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ నాయకత్వంలో పార్టీ మరింత దూకుడుగా ఉంటుందని రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి ఉద్ఘాటించారు. ఈ యొక్క కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్ భవనం మధుసూదన్ రెడ్డి జిల్లా కమిటీ మాజీ ఉపాధ్యక్షులు రమణ గొని శంకరయ్య పోలోజు శ్రీధర్ బాబు గుజ్జుల సురేందర్ రెడ్డి ముత్యాల భూపాల్ రెడ్డి కంచర్ల గోవర్ధన్ రెడ్డి చినుకని మల్లేశం ఆల చిరంజీవి వనం ధనంజయ పకీరు శ్రీనివాస్ రెడ్డి బత్తుల జనార్ధన్ కడవేరు పాండు ఉష్కాగుల నాగరాజు జాల మల్లేశం చేకూరి వెంకటేశం సీనియర్ నాయకులు బూత్ అధ్యక్ష





కార్యదర్శులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ 1992-93 విద్యార్థుల సమ్మేళనం



**వెలుతురు మహబూబాబాద్ మరిపెడ జనవరి 20:** జడ్పీహెచ్‌ఎస్ ఎల్లంపేట 92-93 ఎస్ఎస్సి బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు మేడారంలో వారి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 32 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందం ఇచ్చిందని ఒకరినొకరు ఆప్యాయతతో పలకరించుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ క్రమంలో వారి క్లాస్మేట్ సర్పంచ్ అభ్యర్థిగా గెలుపొందిన జరుపుల.కాలు నాయక్, మరియు వారి క్లాస్మేట్ గండి.పరమేశ్వర్ మాతృమూర్తి ఎల్లంపేట సర్పంచ్ గాఎన్నికైన గండి.రాధమ్మ, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వరవీరా ఫౌండేషన్ చైర్మన్ మక్కా అంజన్ గౌడ్, ఎలక్ట్రిసిటీ డిఈ కంచనపల్లి ఉపేందర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కల్చరల్ సెక్రటరీ లింగంపల్లి దయానంద్, గండి సంధ్యారాణి, దుండి వీరన్న మాట్లాడుతూ బాల్య తండా ఎల్లంపేట గ్రామపంచాయతీ లను ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలని, రాజకీయాలకతీతంగా పరిపాలన కొనసాగించాలని వారిని కోరారు. ఇటీవల ప్రగతి సాధించిన వారి క్లాస్మేట్ కుటుంబ సభ్యులైన టి సుజాత ఉపాధ్యాయులుగా, పోడేటి నవ్య డాక్టర్ గా, కంచనపల్లి డాక్టర్ గా స్వేచ్ఛ పగిండ్ల గగన సింధు,నందిత రూపిని , జరుపుల సంగీత,గండి మనోజ్, పన్నెపూర్తి సాయి లు సాఫ్ట్వేర్ ఇంజనీర్లుగా,ఉర్లకొండ సంధ్య ఆరోగ్య విభాగంలో, గండి నవనీత్ పత్రికా రంగంలో , ప్రతాపని భాను ప్రకాష్ బ్యాంకింగ్ లో ప్రతిభ కనబరుస్తున్న సందర్భంగా వారినిఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వారి క్లాస్మేట్స్ మాజీ సర్పంచ్ అజ్మీరా హోలీ, గండిఅశోక్, గండి శోభన్, పగిండ్ల లక్ష్మయ్య, ఫోడేటి వెంకన్న, భూక్య బావ్ సింగ్ బానోతు జగన్, ఉర్లు గొండ వెంకన్న,ఉర్లగగొండ శోభన్, పొన్నెపూర్తి మల్లయ్య బానోతు లక్ష్మణ్ కుందనపల్లి మోహన్ రావు, భూక్య శ్రీరాములు, గండి రవీందర్, బానోత హేలు, జయమ్మ, చిన్ని, పద్మ లక్ష్మి,అలివేలు,గోవిందమ్మ కనకతార, తదితరులు పాల్గొన్నారు

## జహీరాబాద్ 31వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి రేష్మా అంజూమ్ సిద్ధం

**- స్వర్గీయ తహెరా బేగం సేవలకు కొనసాగింపుగా ముందడుగు...**

**- 'బి' ఫారం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వానికి విజ్ఞప్తి...**

**- రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మద్దతు కోరిన రేష్మా అంజూమ్...**





**జహీరాబాద్, వెలుతురు జనవరి 20:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 31వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు దివంగత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ కౌన్సిలర్ స్వర్గీయ తహెరా బేగం కోడలు రేష్మా అంజూమ్ వెల్లడించారు. ఈ సందర్భంగా రేష్మా అంజూమ్ మాట్లాడుతూ, తన అత్తగారు స్వర్గీయ తాహెరా బేగం సుమారు 25 సంవత్సరాలకు పైగా 31వ వార్డు ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకుని, కౌన్సిలర్‌గా అంకితభావంతో సేవలందించారని గుర్తు చేశారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, రహదారుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పేదల సంక్షేమం వంటి అనేక ప్రజా సమస్యల పరిష్కారంలో ఆమె పోషించిన పాత్ర మరువలేనిదని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలిచి వార్డు అభివృద్ధే లక్ష్యంగా ఆమె రాజకీయ జీవితం కొనసాగిందన్నారు. స్వర్గీయ తాహెరా బేగం మరణానంతరం ఆమె సేవలకు గుర్తింపుగా 31వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తామని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, మాజీ మంత్రి మరియు జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్, రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ హామీ ఇచ్చినట్లు రేష్మా అంజూమ్ తెలిపారు. ఈ క్రమంలో జహీరాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కండెం నర్సింలు కార్యాలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి 31వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా 'బి' ఫారం మంజూరు చేయాలని కోరుతూ అప్లికేషన్ ఫారాన్ని సమర్పించినట్లు తెలిపారు. తన అత్తగారు స్వర్గీయ తాహెరా బేగం చేసిన సేవలను ఆదర్శంగా తీసుకుని, ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని రేష్మా అంజూమ్ హామీ ఇచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 31వ వార్డు ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## సర్పంచ్ లకు ఆత్మీయ సన్మానం





**మునుగోడు, జనవరి 20 (వెలుతురు):** మండలంలో నూతనంగా ఎంపిక కాబడిన సర్పంచ్ లకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లను ఎంపీడీవో ఆధ్వర్యంలో సన్మానం చేశారు.అనంతరం తహసిల్దార్ నేలపట్ల నరేష్,ఎంపీడీవో గంగుల యుగంధర్ రెడ్డి మాట్లాడారు గ్రామాల అభివృద్ధికి సర్పంచులు పాటుపడాలని సూచించారు. మండల,గ్రామస్థాయి అధికారుల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మజ,ఎస్సై ఇరుగు రవి,మండల విద్యాధికారి తలమల్ల మల్లేశం,మండల పరిషత్ సూపరిండెంట్ మేకల విజయభాస్కర్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ మణిదీప్,ఏపిఎం గోసుల భాస్కర్,ఐసిడిఎస్ సూపర్వైజర్స్ శివేష,నాగమణి, ఈజీఎస్ ఏ పీ ఓ నిధుల శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శులు,సర్పంచ్ లు,ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఇస్నాపూర్ గ్రామ బీఆర్ఎస్ మాజీ వార్డ్ సభ్యులు, నాయకులు

**- కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన - కాట శ్రీనివాస్ గౌడ్**








**ఇస్నాపూర్ వెలుతురు జనవరి 20:** ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇస్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన తాజా మాజీ వార్డ్ సభ్యులు నారాయణ దాసు, సంపత్ రెడ్డిలతో పాటు నాయకులు మన్నె రాఘవేందర్, కంజర్ల సాయి, వెంకటేష్ నాయక్ మరియు వారి అనుచరులతో కలిసి సుమారు 50 మంది బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో ఈ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా, కాట శ్రీనివాస్ గౌడ్ గారు వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## మార్కండేయ జయంతికి సర్వం సిద్ధం



**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 20 :** నారాయణఖేడ్ పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తాలోగల శ్రీభక్త మార్కండేయ ఆలయంలో మార్కండేయ జయంతికి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.



బుధవారం మార్కండేయ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు,ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణ,డోలహరణ, పద్మశాలి క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ఇటీవల నూతనంగా గెలిచిన పద్మశాలి సర్పంచ్లకు శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేయనున్నారు.కార్యక్రమాన్ని పురస్కరించుకుని గోస్కే ఈశ్వరమ్మ లక్ష్మన్న, సోమ బుజ్జమ్మ సాయిలు దంపతులు మహాఅన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు



**జహీరాబాద్ వెలుతురు జనవరి 20:** అహింస, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి త్యాగం కేవలం ఒక స్మృతి మాత్రమే కాకుండా, ధర్మ మార్గంలో జీవించడానికి ప్రతి ఒక్కరికీ ప్రేరణ అని మహిళలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుమారి త్యార్ల సాన్వి వాసవి మాత వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు బండమీది, వంశిక, గాద శరణ్య



భరతనాట్య నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. చిన్నారులకు నామ సుభద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ తరఫున నామా స్రవంతి రవికిరణ్ నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెజగం రాజగోపాల్, కార్యదర్శి నామ రవికిరణ్, సలహాదారులు అల్లాడి వీరేశం, మంకల్ సుభాష్, బండమీది రాములు, మహిళా సంఘం అధ్యక్షురాలు మారంమార్ కల్పన, కార్యదర్శి మ్యాడం పద్మ, ప్రముఖులు నీలా వెంకటేశం, కల్వ చంద్రశేఖర్, కొబ్బాజి వీరేశలింగం, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తవారికే కాదు కష్టపడ్డ వారికే బీ-ఫాం ఇవ్వాలి

- ఫతేపూర్ 8వ వార్డులో పార్టీ కోసం శ్రమించిన వారిని గుర్తించాలి
- పీచరి యాదవ రెడ్డి



**శంకర్ పల్లి వెలుతురు జనవరి 20 :** శంకర్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫతేపూర్ 8వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ మున్సిపల్ యూత్ ప్రెసిడెంట్ పీచరి యాదవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు,పార్టీ ఇంచార్జులకు వినయపూర్వకంగా మనవి చేశారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఎన్నో అవరోధాలు, ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదుర్కొంటూ కూడా అహర్నిశలు శ్రమించామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికార పార్టీ బెదిరింపులు, ఆటంకాలు ఉన్నప్పటికీ, వెనుకడుగు వేయకుండా కార్యకర్తలను సమీకరిస్తూ, ప్రజల సమస్యలపై పోరాటాలు చేస్తూ, మా వార్డులో కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది వేయడంలో కీలక పాత్ర పోషించా మని తెలిపారు. ప్రతి ఎన్నిక, ప్రతి ఉద్యమం, ప్రతి పార్టీ కార్యక్రమంలో ముందుండి పనిచేస్తూ, గడపగడపకు కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్లామని, ప్రజలతో నేరుగా సంబంధం పెంచుకుం టూ పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లామని చెప్పారు. ముఖ్యంగా యువతను, మహిళలను, బలహీన వర్గాలను కాంగ్రెస్ పార్టీలో చైతన్యవంతులుగా మార్చేందుకు నిరంతరం కృషి చేశామని పేర్కొన్నారు. ఇటీవల ఫతేపూర్ 8వ వార్డు జనరల్ మహిళా రిజర్వేషన్గా ప్రకటించబడిన నేపథ్యంలో, రాబోయే మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ తరుణం లో, కొత్తగా వచ్చిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వకుండా, కష్టకాలంలో పార్టీ వెన్నంటి నిలబడి పనిచేసిన మాలాంటి కార్యకర్తలు, నాయకుల త్యాగాలను గుర్తించి అవకాశాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీ అధికారంలో లేని రోజుల్లో కూడా వ్యక్తిగత ప్రయోజనాలు పక్కనపెట్టి, ప్రజాసమస్యలపై పోరాడుతూ, కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఎగరేసిన వారిని పక్కన పెట్టడం వల్ల, నిజాయితీగా పనిచేసిన యువత మనోధైర్యం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించిన వారిని ప్రోత్సహిస్తేనే, రాబోయే ఎన్నికల్లో మరింత బలంగా ప్రజల్లోకి వెళ్లగలమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఫతేపూర్ 8వ వార్డులో పార్టీ కోసం నిరంతరం సేవ చేసిన మాలాంటి వారికి పార్టీ నుంచి బీ--ఫాం ఇచ్చి యువతను ప్రోత్సహించాలని కాంగ్రెస్ పార్టీ పెద్దలను పీచరి యాదవ రెడ్డి వినయపూర్వకంగా కోరారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా, భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీ కోసం మరింత ఉత్సాహంతో, అంకితభావంతో పని చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# ఇబ్రహీంపట్నం చెరువు కట్ట సుందరీకరణ కోసం18 కోట్లు

- అంబేద్కర్ చౌరస్తా నుండి ఆక్టోపాస్ వరకు రోడ్డు నిర్మాణం కోసం 60 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే నాలక్ష్యం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి





ఇబ్రహీంపట్నంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు జనవరి 20:** ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకట్ట సుందరీకరణ అభివృద్ధి కోసం హెచ్ఎండిఎ ద్వారా 18 కోట్ల రూపాయలతో అంబేద్కర్ చౌరస్తా నుండి అక్టోపస్ వరకు హెచ్ ఆర్ డి సి ఎల్ ద్వారా 60 కోట్ల రూపాయలతో చేపట్టిన 4 లైన్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినఇబ్రహీంపట్నంఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చినమాట ప్రకా రం ఇబ్రహీంపట్నంపెద్ద చెరువు కట్టను పూర్తిస్థాయిలోఅభివృద్ధి చేసిమినీ ట్యాంక్ బండ్ ల తీర్చిదిద్దుతాను అన్నమాట ప్రకారం ఈరోజు 18 కోట్ల నిధులతో ఇబ్రహీంపట్నం చెరువుకట్ట సుందరీకరణ అభివృద్ధి కోసం శంకుస్థాపన చేయడం జరిగింది అన్నారు ఇబ్రహీంపట్నం నియో జకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే నాలక్ష్యం అని అన్నారు రాబోయే రోజుల్లో ఇబ్రహీంపట్నంనియోజకవర్గం రూపురేఖలు మార్చి అభివృద్ధిలో ఆదర్శ నియోజకవర్గంల తీర్చిదిద్దుతాను అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీరాష్ట్ర యువజన నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడుఈసీ శేఖర్ గౌడ్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి కంబాలపల్లి గురునాథ్ రెడ్డిమాజీ జెడ్పిటిసి భూపతిగల్లా మహిపాల్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ ఉప్పరగూడ సహకార బ్యాంక్ చైర్మన్ పాండురంగారెడ్డిమార్కెట్ కమిటీ డైరెక్టర్లు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులుతదితరులు పాల్గొన్నారు

# జహీరాబాద్‌లో పదో తరగతి విద్యార్థులకు సాలార్ మిల్లత్ మోడల్ పేపర్ గైడ్స్ పంపిణీ

- ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ సూచనలతో విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం...
- కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ చేతుల మీదుగా మోడల్ పేపర్స్ పంపిణీ...





**జహీరాబాద్ వెలుతురు జనవరి 20:** ఏఐఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షులు, లోక్‌సభ సభ్యులు బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ సూచనల మేరకు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ జహీరాబాద్ పట్టణ పరిధిలో విద్యార్థులకు విద్యా సహకారం అందించారు. జహీరాబాద్ పట్టణంలోని గడి మహిలా ప్రాంతంలో ఉన్న ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో పాటు, పట్టణానికి చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు సాలార్ మిల్లత్ మోడల్ పేపర్ ఆల్-ఇన్-వన్ గైడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థుల జీవితంలో కీలకమైన దశ అని, ఈ సమయంలో కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు నిర్మించుకోవచ్చని తెలిపారు. మోడల్ పేపర్లు పరీక్షల విధానాన్ని అవగాహన చేసుకునేందుకు, సమయపాలనతో సమాధానాలు రాయేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు. విద్యార్థులు ఈ గైడ్స్‌ను పూర్తిగా అధ్యయనం చేసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్య అనేది సామాజిక మార్పుకు మూలాధారం అని, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే మజ్లిస్ పార్టీ లక్ష్యమని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థుల అభ్యాసానికి అవసరమైన సహకారం భవిష్యత్తులోనూ కొనసాగుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మజ్లిస్ జిల్లా అధ్యక్షులు ఖాజా నిజామొద్దీన్ (అడ్వకేట్), జిల్లా జనరల్ సెక్రటరీ మోహిద్దీన్ గౌరీ సహాబ్, జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ అత్తర్ అహ్మద్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు ఎండీ ఫాజిల్, సదాశివపేట్ పట్టణ అధ్యక్షులు ఎండీ గౌస్, జహీరాబాద్ పట్టణ జనరల్ సెక్రటరీ రఫీ, జహీరాబాద్ 12వ వార్డు అధ్యక్షులు సయ్యద్ మొహసిన్, పట్టణంలోని ఆయా వార్డుల అధ్యక్షులు, సయ్యద్ జఫర్ హుస్సేన్ (పప్పు భాయ్), మజ్లిస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇచ్చోడ మండల కేంద్రంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం..





**ఇచ్చోడ వెలుతురు జనవరి 20:** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో బాగంగా మంగళవారం రోజున ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ మండలం కేంద్రం లోని గ్రామస్తులకు , టాక్సీ ,గూడ్స్,స్కూల్ బస్సుల, ఆటో డ్రైవర్ సోదరులకు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎం.వి.ఐ జి. ప్రదీప్ కుమార్ గౌడ్ రాజు, సీఐరాజేశ్వర్ , ఆర్టిఏ నెంబర్, ఏ ఎం వి ఐ ఎం. స్వేత , పిహెచ్సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బ్రహ్మనంద రెడ్డి స్థానిక నాయకులు వాహన దారులు,పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు రహదారి భద్రత ప్రాముఖ్యతపై మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ద్విచక్రవాహనం నడిపే వారు మరియు ఇద్దరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు, సీట్ బెల్టు ధరించాలని,డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వాడకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్ లు వాహనాలు నడపరాదని, అలా నడపడం వల్ల తల్లితండ్రులకు శిక్ష పడుతుందని అని తెలిపారు.వేగంగా వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌కు వాహనంపై నియంత్రణ తగ్గిపోతుందని తెలియజేశారు. డిఫెన్స్ డ్రైవింగ్ అనేది రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు ప్రమాదాలను ముందుగానే ఊహించి, ఇతరుల తప్పులను కూడా పరిగణలోకి తీసుకుని, సురక్షితంగా డ్రైవ్ చేయడం. ఇది కేవలం ట్రాఫిక్ నియమాలు పాటించడం మాత్రమే కాదు; ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండటం, జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవడం కూడా.డ్రైవింగ్ అనేది కేవలం వ్యక్తిగత అనుభవంగా కాకుండా, ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతకు సంబంధించిన ఒక గొప్ప బాధ్యతగా భావించి వాహనాలు నడపాలి.ఆటోలో నిబంధనల ప్రకారం డ్రైవర్ తో పాటు ముగ్గురు మాత్రమే ప్రయాణించాలి. కానీ పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు.ఆటో రిక్షా డ్రైవర్ వాహనం ఇరుపక్కల (డ్రైవర్ పక్కన లేదా బయట వైపులా) ప్రయాణికులను అనుమతించరాదు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు గాయపడే అవకాశం ఎక్కువ. ఇది ట్రాఫిక్ నిబంధనలకు కూడా విరుద్ధం. అందుకే ప్రతి డ్రైవర్ బాధ్యతగా ఆటోలో నిర్ణయించిన పరిమితిలోనే ప్రయాణికులను తీసుకెళ్లాలి. అలాగే డ్రైవర్‌కు స్టీరింగ్ మరియు నియంత్రణపై పూర్తి దృష్టి ఉండదు. ప్రయాణికులు రోడ్డుపై పడిపోవడం లేదా ఇతర వాహనాలతో ఢీకొనడం వంటి తీవ్రమైన ప్రమాదాలు సంభవించవచ్చు. కాబట్టి ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, కేవలం నిర్ణయించిన సీట్లలోనే ప్రయాణికులను అనుమతించి అందరి భద్రతను కాపాడాలి. ఒక చిన్న నిర్లక్ష్య నిర్ణయం వల్ల అనేక ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. సరైన లేన్‌ను అనుసరించడం కేవలం ట్రాఫిక్ నిబంధన మాత్రమే కాదుఅది మీ భద్రతతో పాటు, ఇతర రోడ్డు వినియోగదారుల ప్రాణాలను కాపాడే బాధ్యత.డ్రైవింగ్ చేస్తున్నప్పుడు డ్రైవర్ వద్ద ముఖ్యమైన పత్రాలు ఉండాలి – డ్రైవింగ్ లైసెన్స్, వాహనం యొక్క రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బీమా సర్టిఫికేట్, కాలుష్య తనిఖీ సర్టిఫికేట్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ మరియు పర్మిట్ ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు.

## జాతీయ, రాష్ట్ర స్థాయి విజేతలకు జిల్లా ఎస్పీ అభినందనలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) జనవరి 20**

జాతీయ మరియు రాష్ట్ర స్థాయి క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, కామారెడ్డి జిల్లా పేరును సువర్ణాక్షరాలతో లిఖించిన క్రీడాకారిణులను జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ గారు ఘనంగా అభినందించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో క్రీడాకారిణులను, వారి తల్లిదండ్రులను మరియు కోచ్‌లను ఎస్పీ గారు ప్రత్యేకంగా ప్రశంసించారు. విజేతల వివరాలు. ఆర్. విద్యాసాయి.జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్. శ్రీనివాస్ – రూపారాణి దంపతుల కుమార్తె. జాతీయ స్థాయి రోయింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఒక బంగారు పతకం (+శ్రీ్రీస), రెండు కాంస్య పతకాలు (దీతీశీఅఓవ) సాధించి జిల్లా గర్వపడేలా చేశారు. ఏ. సాయి శ్రేష్ఠ.ఏ. రమ్య .సాయి కృష్ణ దంపతుల కుమార్తె. తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ (8 సంవత్సరాల విభాగం)లో స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో గోల్డ్ మెడల్ సాధించి రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మన జిల్లా క్రీడాకారులు కేవలం జాతీయ స్థాయికే పరిమితం కాకుండా అంతర్జాతీయ మరియు ఒలింపిక్ స్థాయి క్రీడల్లో పాల్గొని దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణులను ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులను ఆయన అభినందించారు. అలాగే, ఆర్. విద్యాసాయిని తీర్చిదిద్దిన అకింపేట్ స్పోర్ట్స్ స్కూల్ కోచ్‌లను మరియు ఏ. సాయి శ్రేష్ఠను మేటి అథ్లెట్‌గా తీర్చిదిద్దిన కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ కోచ్ టి. శివ గౌడ్‌ను ఎస్పీ గారు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ శ్రీ బి. చైతన్య రెడ్డి, ఐపీఎస్ గారు, కామారెడ్డి జిల్లా ఎస్జీఎఫ్ (గా+ఖీ) సెక్రటరీ హీరలాల్ గారు పాల్గొని క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలియజేశారు.





# మా ఇండ్లను కూల్చాకండి

**రాజేంద్రనగర్ వెలుతురు జనవరి 20:** తమ దశాబ్దాలుగా కుటుంబాలు నివసిస్తున్న కొందరు పోలీసులతో కలిసి దౌర్జన్యంగా తమ ఇళ్ళను కూల్చి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దీంతో తాము జనవరి 9వ తేదీన హైకోర్టును ఆశ్రయించాల్సిన అవసరం వచ్చిందని హైకోర్టు వారు మూడు వారలు స్టేటస్ కో జరిచేయడం జరిగింది అని రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ వాసులు వెల్లడించారు మంగళవారం హనుమాన్ నగర్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డి బాలమ్మ పి సునీత కే లక్ష్మీ ఎస్ రాజమ్మ తదితరులు మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా హనుమాన్ నగర్ సర్వే నంబర్ 311,12 ప్రాంతంలో తమ తమ కుటుంబ సభ్యులుము నివసిస్తునాం ఇప్పటికీ నాలుగవ తరం ప్రస్తుతం ఈ ఇళ్లలో నివాసం ఉంటున్నట్టు తెలిపారు. నాడు పంచాయతీగా ఉన్న సమయంలో తమ తాతలు ఇల్లు కట్టుకునేందుకు అనుమతి తీసుకుని ఇంటి నంబర్లను తీసుకున్నారని తెలిపారు. ఇంటికి ప్రతి సంవత్సరం ఆస్తి పనులు చెల్లిస్తున్నట్టు తెలిపారు ఇంటి నెంబర్ పైనే కరెంటు మీటర్లు తెలుపు రంగు రేషన్ కార్డులు ఆధార్ కార్డులు ఓటర్ ఐడి కార్డులు మంజూరు అయ్యాయన్నారు. ఈ పత్రాలన్నీ రికార్డు ప్రకారం గత ఐదు దశాబ్దాలుగా ఉన్నాయన్నారు. 2020 వ సంవత్సరం నుండి ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరగడంతో కొందరు కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పట్టాభూమి మదని కొందరు వచ్చారని అప్పుడు నుండి తమకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి అన్నారు గతంలో సైతం మేము హైకోర్టును ఆశ్రయించామని హైకోర్టు స్పష్టంగా ఆదేశాలిచ్చిందన్నారు. గత కొన్ని రోజులుగా సి వివేకానంద అనే వ్యక్తి తో రాజేంద్రనగర్ ఏసీపి కార్యాలయం, పోలీస్ స్టేషన్ నుండి తమకు బెదిరింపులు ఎక్కువ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లాలని ఆ ఇళ్లను కూల్చివేయాలని తమను బెదిరిస్తున్నారని తెలిపారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించామని వీరితో పాటు తమను రెవిన్యూ అధికారులు రెండు మూడు రోజులకు ఒకసారి వచ్చి వేధిస్తున్నారని బోరునా విలపించారు ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

# ప్రజల సమస్యలను ప్రశ్నించినందుకు హరీశ్ రావుపై కేసులు

- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు...



**జహీరాబాద్ వెలుతురు జనవరి 20:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు హరీశ్ రావుపై ఇటీవల పెట్టబడిన అక్రమ కేసులను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రుణమాఫీ ఎందుకు చేయలేదని అడిగినందుకు, సర్పంచుల బిల్లులు ఇవ్వకపోవడం వంటి సాధారణ ప్రజల సమస్యలను ప్రశ్నించినందుకు, వరద బాధితులకు బాసటగా నిలిచేందుకు వెళ్లినందుకు హరీశ్ రావుపై కేసులు పెట్టబడ్డాయని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, బొగ్గు స్కాం, హిల్‌టిపి స్కాం, పవర్ స్కాం, ల్యాండ్ సేల్ స్కాం వంటి వివిధ స్కాంలలో బిఆర్ఎస్ వెలికితీసిన నిజాలను ప్రస్తావిస్తూ, ప్రత్యర్థి ప్రభుత్వాలు డైవర్షన్ పాలిటిక్స్ ద్వారా ఈ విషయాలను దాచేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. అయితే, రేవంత్ రెడ్డి ఎన్ని తప్పుడు కేసులు పెట్టినప్పటికీ, హరీశ్ రావు వారి సంకల్పం, ప్రజల పక్షంలో నిలిచే ధైర్యం ఎలాంటి అడ్డంకికి గురి కాకుండా ఉంటుందని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీర్చే అన్ని ప్రయత్నాలు వృథా అని మాణిక్ రావు స్పష్టం చేశారు.

## జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఇన్‌ఛార్జ్‌గా తహశీల్దార్ పి. దశరథ్‌కు పూర్తి అదనపు బాధ్యతలు



**జహీరాబాద్ వెలుతురు జనవరి 20:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీ కె. సత్య ప్రణవ్, 19 జనవరి 2026 నుండి 28 ఫిబ్రవరి 2026 వరకు హైదరాబాద్‌లోని ఎంసిహెచ్ఆర్డీ (వీజఒ=ఐ) లో నిర్వహించనున్న ఫౌండేషన్ కోర్సు శిక్షణా కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో, మున్సిపల్ పరిపాలనలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య, ఐ.ఏ.ఎస్., ఉత్తర్వులు జారీ చేస్తూ, జహీరాబాద్ మండలం తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పి. దశరథ్‌కు మున్సిపల్ కమిషనర్, జహీరాబాద్ పదవికి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తారని తెలిపారు. శిక్షణా కాలంలో పట్టణ అభివృద్ధి, మున్సిపల్ సేవలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## కొనసాగుతున్న జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) జనవరి 20**



జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం విద్యానికేతన్ పాఠశాలలో రహదారి భద్రత ఇతివృత్తంపై పెయింటింగ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో పలు విద్యాసంస్థల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ చిత్రాల ద్వారా రహదారి భద్రతపై అవగాహనను ప్రతిబింబించారు. ఈ సందర్భంగా సహాయక మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్లు స్నిగ్ధ మరియు శ్రవణ్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎవరు తక్కువ కాకుండా అద్భుతంగా చిత్రాలు గీయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన ఉత్తమ చిత్రాలను జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్రజల దర్శనార్థం ప్రదర్శనకు ఉంచనున్నట్లు తెలిపారు. అలాగే, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు రోజున ఉన్నతాధికారుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచిన విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యానికి రవాణా శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రంలో 50శాతం పచ్చదనం

కవర్ ప్రాజెక్టుపై చర్చించారు. ప్రాజెక్టు ప్రణాళికలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంపు ప్రాజెక్టుకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.. రాష్ట్రం మొత్తం భూ భాగంలో 2047 నాటికి 50 శాతం పచ్చదనంతో నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం 32.60 లక్షల ఎకరాల్లో మొక్కలు నాటాల్సి ఉంది. ఈ లక్ష్యంలో భాగంగా 2030 నాటికి 37 శాతం పచ్చదనం నింపాల్సి ఉందన్నారు.. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో 30 శాతం గ్రీనరి ఉండగా.., వచ్చే నాలుగేళ్లలో మరో 7 శాతం గ్రీనరీ పెంచాల్సి ఉంది. అందుకోసం 9 లక్షల హెక్టార్లలో చెట్లను నాటాలని పిలుపునిచ్చారు.. ఈ యజ్ఞంలో అన్ని శాఖలు తమ వంతు భాగస్వామ్యం పోషించాల్సి ఉంది. అందులో ఉద్యానవన శాఖ 12 శాతం మొక్కలు నాటే బాధ్యతను స్వీకరించాల్సి ఉంది.. ప్రతి మొక్కా పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడాలి.. వీటితోపాటు అటవీ, పర్యావరణ శాఖలు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలు, నీటిపారుదల శాఖ, పాఠశాల విద్యాశాఖ, రోడ్లు భవనాల శాఖ, పరిశ్రమల శాఖ, వ్యవసాయ శాఖ, కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న రైల్వే తదితర శాఖలు తమ తమ పరిధిలో లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్లాల్సి ఉందన్నారు జాతీయ రహదారులకి ఇరువైపులా మొక్కలు నాటే సంప్రదాయం ఉంది.. దీన్ని రాష్ట్ర పరిధిలోని రహదారుల నిర్మాణంలోనూ అమలు చేయాలి అన్నారు పవన్.. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టు కూడా గ్రీన్ కవర్ పెంపునకు దోహదపడుతుంది.. 970 ఎకరాల తీర ప్రాంతం వెంబడి 40 శాతం అటవీ శాఖ పరిధిలో ఉండగా, మిగిలిన భూభాగంలో ప్రాజెక్టుని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరం అయిన ప్రణాళికలు ఆయా శాఖలు సిద్ధం చేయాలి. తీర ప్రాంతం వెంబడి ఉన్న ప్రాంతంలో అక్కడ వాతావరణ పరిస్థితులకు తట్టుకునే మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పారిశ్రామిక కారిడార్లలో కాలుష్య నియంత్రణకు తోడ్పడే మొక్కలను పెంచాలి. రైతుల భూముల్లో వారికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించే పండ్ల రకాల మొక్కలు పెంచాలి. కాలువగట్లు, చెరువుల గట్ల వెంబడి కూడా పండ్ల మొక్కలు నాటాలి. మనం నాటే ప్రతి మొక్క పర్యావరణానికి, ప్రజలకు ఉపయోగపడే స్వజాతి మొక్కలు ఉండేలా చూసుకోవాలి. అందుకు సంబంధించి శాఖల వారీ యాక్షన్ ఎ÷–లాన్ అవసరం అన్నారు.. నిర్దేశిత సమయంలో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేయండి. బ్జడెట్ కేటాయింపులు ముఖ్యమంత్రి తో చర్చిస్తాం.. లక్ష్యాలకు అనుగుణంగా కార్యచరణ సిద్ధం చేసే బాధ్యతను యంత్రాంగం నిబద్ధతతో ముందుకు తీసుకువెళ్లాలి.. అన్ని సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఫిబ్రవరి 5వ తేదీన జరిగే తదుపరి సమావేశానికి పూర్తి స్థాయి ప్రణాళికలతో రావాలని అన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

## ఇంటర్ విద్యార్థులకు ఉపశమనం

- ఐదు నిముషాల ఆలస్యానికి బోర్డు ఆమోదం

**హైదరాబాద్,జనవరి20 వెలుతురు:**
ఇంటర్ వార్షిక పరీక్షలకు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించాలని నిర్ణయం తీసుకున్నది. ఇదే నిబంధన నిరుడు అమలుకాగా, ఈసారి అమలు చేయనున్నారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. 9లక్షలకు పైగా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ నెల 23న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, 24న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగబోతున్నాయి. ఇవి ముగిసిన తర్వాత ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలు రానున్నాయి.

## చలాన్ల వసూళ్ల కోసం వేధించవద్దు

- ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు ఆదేశం




**హైదరాబాద్,జనవరి20 వెలుతురు:**
వాహన చలాన్లపై వాహనదారులను వేధింపులకు గురి చేయవద్దని ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్ల కోసం వాహనదారులను బలవంతం చేయవద్దని తేల్చి చెప్పింది. వాహనాల తాళాలు లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదంది. స్వచ్ఛందంగా చెల్లిస్తేనే చలాన్లు వసూలు చేయాలని, లేకపోతే నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. కాగా.. గత సంవత్సరం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి రూ.239.37 కోట్ల చలాన్లు విధించారు. ఇందులో వాహనాలను ఆపి ట్రాఫిక్ పోలీసులు విధించిన చలాన్లు 10,27,335 ఉండగా, ఈ–చలాన్లు 25,93,152 ఉన్నాయి. ఈ రెండు రకాల చలాన్ల మొత్తం విలువ రూ. 239.37 కోట్లు అని వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది. కొద్దిరోజుల క్రితం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అరైవ్–అలైవ్ పేరుతో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు పోలీసులు చలానాలు వేయగానే.. వారి బ్యాంకు ఖాతా నుంచి ఆ మొత్తం ఆటోమెటిక్‌గా చెల్లింపు జరిగిపోయేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు.

## వీధి కుక్కలపై ఇచ్చిన తీర్పుపై విమర్శలు

- మేనకాగాంధీ తీరుపై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ,జనవరి20 వెలుతురు:**
కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ పై భారత సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వీధి శునకాలపై ఇచ్చిన తీర్పుపై మేనకా చేసిన విమర్శలను తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. ఆమె కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని అభిప్రాయపడింది. వీధి శునకాల అంశంపై నేడు మరోసారి విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎటువంటి ఆలోచన లేకుండా కేంద్ర మాజీ మంత్రి అందరిపై అన్ని రకాల వ్యాఖ్యలు చేశారని మండిపడింది. కోర్టు ఆచితూచి వ్యవహరించాలని మీరు చెబుతున్నారు. కానీ, మీ క్లయింటు మేనకా గాంధీ ఎటువంటి వ్యాఖ్యలు చేశారో అడిగారా? ఆమె పాడ్‌క్యాస్ట్‌ను విన్నారా? ఆలోచన లేకుండా ప్రతి ఒక్కరిపై అన్ని రకాల వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో ఆమె తీరు గమనించారా? అని మేనకా గాంధీ తరఫున సీనియర్ అడ్వేకేట్ రాజు రామచంద్రన్‌ను సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఆమె మాటలు కోర్టు ధిక్కారమే అయినప్పటికీ న్యాయస్థానం ఔన్నత్యం దృష్ట్యా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంది. వీధి శునకాల సమస్యను కట్టడిచేసేందుకు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆమె ఎంత బ్జడెట్ కేటాయించారని ఈ సందర్భంగా పిటిషనర్‌ను జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. శునకాలకు ఆహారం పెట్టేవారిని జవాబుదారీ చేయాలని తేలిగ్గా న్యాయస్థానం వ్యాఖ్యానించలేదని, సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అలా చెప్పామన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా బోత్ మండలం కేంద్రంలోని ఆటో డ్రైవర్ లకు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం

**ఆదిలాబాద్ జిల్లా వెలుతురు జనవరి 20:**
జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో బాగంగా మంగళవారం రోజున ఆదిలాబాద్ జిల్లాలోని బోత్ మండలం కేంద్రం లోని ఆటో డ్రైవర్ లకు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏం వి ఐజి. ప్రదీప్ కుమార్ గౌడ్, సీఐ డి. గురుస్వామి , ఏ ఎం వి ఐ ఎం. స్వేత, ఎస్సైలు శ్రీ సాయి, పురుషోత్తం ,మహేందర్ స్థానిక నాయకులు వాహన దారులు,డ్రైవర్స్ ,నాగభూషణం మెమోరియల్ స్కూల్ విద్యార్థులు తదితరులు.పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ రహదారి భద్రత ప్రమాణాలు పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ద్విచక్రవాహనం నడిపే వారు ఇద్దరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు, సీట్ బెల్టు ధరించాలని,డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వాడకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్ లు వాహనాలు నడపరాదని, అలా నడపడం వల్ల తల్లితండ్రులకు శిక్ష పడుతుందని అని తెలిపారు. వేగంగా వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌కు వాహనంపై నియంత్రణ తగ్గిపోతుందని తెలియజేశారు. డిఫెన్స్ డ్రైవింగ్ అనేది రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు ప్రమాదాలను ముందుగానే ఊహించి, ఇతరుల తప్పులను కూడా పరిగణలోకి తీసుకుని,



సురక్షితంగా డ్రైవ్ చేయడం. ఇది కేవలం ట్రాఫిక్ నియమాలు పాటించడం మాత్రమే కాదు; ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండటం, జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవడం కూడా.డ్రైవింగ్ అనేది కేవలం వ్యక్తిగత అనుభవంగా కాకుండా, ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతకు సంబంధించిన ఒక గొప్ప బాధ్యతగా భావించి వాహనాలు నడపాలి.ఆటోలో నిబంధనల ప్రకారం డ్రైవర్ తో పాటు ముగ్గురు మాత్రమే ప్రయాణించాలి. కానీ పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు.ఆటో రిక్షా డ్రైవర్ వాహనం ఇరుపక్కల (డ్రైవర్ పక్కన లేదా బయట వైపులా) ప్రయాణికులను అనుమతించరాదు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు గాయపడే అవకాశం ఎక్కువ. ఇది ట్రాఫిక్ నిబంధనలకు కూడా విరుద్ధం. అందుకే ప్రతి డ్రైవర్ బాధ్యతగా ఆటోలో నిర్ణయించిన పరిమితిలోనే ప్రయాణికులను తీసుకెళ్లాలి. అలాగే డ్రైవర్‌కు స్టీరింగ్ మరియు నియంత్రణపై పూర్తి దృష్టి ఉండదు. ప్రయాణికులు రోడ్డుపై పడిపోవడం లేదా ఇతర వాహనాలతో ఢీకొనడం వంటి తీవ్రమైన ప్రమాదాలు సంభవించవచ్చు. కాబట్టి ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, కేవలం నిర్ణయించిన సీట్లలోనే ప్రయాణికులను అనుమతించి అందరి భద్రతను కాపాడాలి. ఒక చిన్న నిర్లక్ష్య నిర్ణయం వల్ల అనేక ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. సరైన లేన్‌ను అనుసరించడం కేవలం ట్రాఫిక్ నిబంధన మాత్రమే కాదుఅది మీ భద్రతతో పాటు, ఇతర రోడ్డు వినియోగదారుల ప్రాణాలను కాపాడే బాధ్యత. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు డ్రైవర్ వద్ద ముఖ్యమైన పత్రాలు ఉండాలి – డ్రైవింగ్ లైసెన్స్, వాహనం యొక్క రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బీమా సర్టిఫికేట్, కాలుష్య తనిఖీ సర్టిఫికేట్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ మరియు పర్మిట్ ఉండాలి. ఆటోలపై రోడ్డు భద్రత స్టిక్కర్లు అంటించారు అనంతరం నాగభూషణం మెమోరియల్ స్కూల్‌కు చెందిన విద్యార్థుని , విద్యార్థులతో బోత్ మండల కేంద్రం యందు రోడ్ సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'అరైవ్ అలైవ్' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా రహదారి భద్రతా నియమాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేశారు.

# గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి - మంత్రి సీతక్క

**- గ్రామాలకు సేవ చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గ్రామాలను ఎంపిక చేయాలి**

**- నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు )జనవరి 20**
గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతి సర్పంచ్ పని చేయాలని పంచాయతీ రాజ్ శాఖ రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మంగళవారం జిల్లా కేంద్రం లోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలు ప్రజాస్వామ్యానికి పునాది లాంటివని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందని తెలిపారు. త్రాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం గ్రామాభివృద్ధి



కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రజలతో నిరంతరం సమన్వయం తో పారదర్శకంగా పాలన సాగించాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధి దిశగా సమర్థవంతంగా సేవలందించి, జిల్లాలోని గ్రామాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గ్రామాభివృద్ధి సంబంధిత కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పరిశుభ్రత, త్రాగునీరు, పచ్చదనం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే గ్రామాలు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టే పనులన్నీ నాణ్యతతో, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో అంగరంగ వైభవంగా ఇందిరా గాంధీ విగ్రహావిష్కరణ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) జనవరి 20**
కామారెడ్డి పట్టణ నడిబొడ్డున రైల్వే స్టేషన్ సమీపంలోని ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన దివంగత ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ , జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ పేదల పెన్నిధి ఇందిరమ్మ మహమ్మద్ అలీ షబ్బీర్ తన ప్రసంగంలో ఇందిరా గాంధీతో కామారెడ్డికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కామారెడ్డి అంటేనే కాంగ్రెస్ కోట అని, ఇక్కడ ఇందిరా గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. గరీబీ హటావో దేశ్ కో బచావో నినాదంతో ఆమె దేశంలోని నిరుపేదల బతుకుల్లో వెలుగులు నింపారూ, బ్యాంకుల జాతీయీకరణ వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న ధీశాలి ఆమె అని కొనియాడారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, రాబోయే రోజుల్లో ఇందిరమ్మ రాజ్యంలోని సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ చేరుస్తామని హామీ ఇచ్చారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇంచార్జ్ మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఆద్యురాలు ఇందిరా గాంధీ ఆడబిడ్డల ఆత్మగౌరవం దేశానికి తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ మహిళల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. ఇందిరమ్మ రాజ్య స్థాపన నేడు తెలంగాణలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం 'ఇందిరమ్మ రాజ్యం' దిశగా అడుగులు వేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు నీడ కల్పిస్తున్నామని చెప్పారు. ధైర్యానికి మారుపేరు ఉక్కు మహిళగా ఆమె తీసుకున్న నిర్ణయాలు నేటికీ దేశానికి దిక్సూచి అని, ఆమె చూపిన బాటలోనే తాము నడుస్తున్నామని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ సిద్ధాంతమే ఇందిరమ్మ మార్గం దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అని, ఆమె త్యాగం వెలకట్టలేనిదని అన్నారు. కామారెడ్డి గడ్డపై ఇందిరమ్మ విగ్రహం సాక్షిగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఆనాడు ఇందిరమ్మ ప్రవేశపెట్టిన 20 సూత్రాల పథకమే నేడు అనేక సంక్షేమ పథకాలకు పునాది



అని గుర్తు చేశారు. ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ ఎవరు మాట్లాడుతూ ఇందిరా గాంధీ ఒక వ్యక్తి కాదు, ఒక గొప్ప శక్తి. ఆమె దూరదృష్టి వల్లే నేడు దేశం ఆహార భద్రతలో స్వయం సమృద్ధి సాధించింది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామంలో ఆమె పథకాల గుర్తులు ఉన్నాయి. ఆమె ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేస్తాముఅని. పేర్కొన్నారు.

# ఇచ్చోడ లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ లో విద్యార్థులకు రోడ్ ట్రాఫిక్ రూల్స్, రహదారి భద్రత నియమాల గురించి అవగాహన

**ఇచ్చోడ వెలుతురు జనవరి 20:**
రహదారి భద్రతా మాసోత్సవాలలో బాగంగా మంగళవారం రోజున ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజ్ (బాలురకు) విద్యార్థులకు రోడ్ ట్రాఫిక్ రూల్స్ మరియు రహదారి భద్రత నియమాల గురించి అవగాహన కల్పించారు.రోడ్డు సంకేతాల (సంజ్ఞల) గురించి తెలుసుకోవటం ఎంతో అవసరం, మనం రోడ్డుపై వెళు‌న్నప్పుడు నిత్యం అనేక రకాల రోడ్డు సంకేతాలను చూస్తుంటాం. అందులో కొన్ని దారి చూపేవైతే, మరికొన్ని సమాచారాన్ని అందించేవి, ఇంకొన్ని డ్రైవర్లను అప్రమత్తం చేసివిగా ఉంటాయి. చిన్న వయస్సులోనే విద్యార్థులకు అవగాహన కల్పించి, వారి తల్లిదండ్రులకు మరియు ఇరుగుపొరుగు వారికి రోడ్డు భద్రతా నిబంధనలను పాటించమని చెప్పేందుకు వీలుగా వారికి అవగాహన కల్పించడం జరిగింది.ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల బారిన పడి వందలాది మంది ప్రాణాలు కోల్పుతున్నారు చాల కుటుంబాలు చిన్న భిన్నం అవుతున్నాయి ట్రాఫిక్ నిబంధనలు పాటించి జాగ్రత్త గా వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారించ వచ్చుని తెలిపినారు .రోడ్డు భద్రత అనేది ప్రతి క్షణం, ప్రతి నిమిషం, ప్రతి రోజు అవసరమని వాటిని నిర్లక్ష్యం చేస్తే మనతో పాటు ఎదుటివారి ప్రాణాలు




కూడా తీసిన వారం అవుతామన్నారు. వేగాన్ని నియంత్రించుకుంటూ ప్రయాణాలు చేసినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలమన్నారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు తగ్గుతాయని, సీటు బెల్టు ధరించాలని వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు రోడ్డు ప్రమాదాల నుండి రక్షణకు తప్పని సరిగా హెల్మెట్ ధరించండి.. ఎందుకంటే ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ అత్యంత రక్షణ కవచంగా ఉంటుంది..రోడ్డు ప్రమాదాలలో 85%శాతం మంది ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్నవారు హెల్మెట్ లేని కారణంగానే తలకు తీవ్ర గాయాలై ఎక్కువగా మృత్యువాత పడుతున్నారని ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో తేలింది. అలా జరగడానికి ప్రధాన కారణం ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు హెల్మెట్ దరించకపోవడమే..ఈ కార్యక్రమం లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ గౌడ్ , రాజేశ్వర్, ఆర్టిఏ మెంబర్ ,వినోద్ సౌద ప్రిన్సిపాల్ ,శ్వేత, ఏ ఎం వి ఐ ,బ్రహ్మానంద రెడ్డి , పిహెచ్సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ , కాలేజీ, పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలవరంలో విదేశీ ప్రతినిధి బృందం

**- రెండోరోజు పలు ప్రాంతాల పరిశీలన**




**ఏలూరు,జనవరి20( వెలుతురు):**
పోలవరం ప్రాజెక్ట్ లో విదేశీ నిపుణుల బృందం రెండో రోజు పర్యటన మంగళవారం కొనసాగింది. విదేశీ నిపుణులు సీన్ హించిబెగ్రర్ , డేవిడ్ బి పాల్ , జియాన్ ఫ్రాంకో డి సీకోలతో పాటు కేంద్ర జల వనరుల శాఖలోని వివిధ విభాగాల సీనియర్ అధికారులు ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. రెండో రోజు మధ్యాహ్నం వీరు మెయిన్ డాం గ్యాప్ 2 ఇసుక రీచ్, మెటీరియల్ లభ్యత మొదలైన వాటిని పరిశీలిస్తారు .అంతకు ముందు కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ ప్రతినిధులతో సమావేశమై తొలి రోజు ఫీల్డ్ లో తమ దృష్టికి వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వర రావు, ఈ ఎన్ సి కె నరసింహమూర్తి, పోలవరం ప్రాజెక్ట్ ఎస్ ఈ ఆర్ రామచంద్ర రావు, ఎం ఈ ఐ ఎల్ జనరల్ మేనేజర్ ఏ గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి, తదితరులు అంతర్జాతీయ నిపుణుల బృందంతో పాటు కేంద్ర జలవనరుల శాఖ అధికారులకు వివరాలు అందించారు. వారి వివరాలతోపాటు తాము ఫీల్డ్లో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించుకొని సందేహాలు తీర్చుకున్నారు. ఈ బృందంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి , మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, సిఎస్ అధికారులు మనీష్ గుప్తా , రవి అగర్వాల్ , సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి వి ఎస్ రామారావు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, డైరెక్టర్ కె శంకర్, ఎన్ ఐ ఆర్ ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతాని ఉన్నారు.

## టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**- మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు**



**అమరావతి,జనవరి20( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్‌లో 10వ తరగతి పరీక్షల తుది షెడ్యూల్ విడుదల అయింది. గతంలో ఇచ్చిన టెంటేటివ్ షెడ్యూల్‌నే ÷నైల్ షెడ్యూల్‌గా ఖరారు చేస్తూ పరీక్షా విభాగం మంగళవారం పాఠశాలలకు సమాచారం ఇచ్చింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్సీ బోర్డు పరీక్షల విభాగం డైరెక్టర్ ప్రకటన విడుదల చేశారు.పదవతరగతి పరీక్షల షెడ్యూల్ ఇలా ఉంది. మార్చి 16వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్.,మార్చి 18వ తేదీన సెకండ్ లాంగ్వేజ్.,మార్చి 20వ తేదీన ఇంగ్లీషు.,మార్చి 23వ గణితం.,మార్చి 25వ తేదీన ఫిజికల్ సైన్స్.,మార్చి 28వ తేదీన బయోలాజికల్ సైన్స్. మార్చి 31వ తేదీన సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహిస్తారు.

## నకిలీ మద్యం కేసులో జోగి బ్రదర్స్‌కు బెయిల్

**విజయవాడ,జనవరి20( వెలుతురు):**



ఏపీ కల్తీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాముకు విజయవాడ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. 6వ ంఏఓఈఅ కోర్టు భవానీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో వీరిద్దరికి బెయిల్ మంజూరు చేసింది. జోగి రమేశ్, జోగి రాము.. భవానీపురంలో నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్నారు. వీరిద్దరూ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ కేసులో ఏ18గా జోగి రమేశ్, ఏ19గా జోగి రాము పేర్లు ఉన్నాయి. అయితే.. ములకల చెరువు కేసులో ఇంకా జోగి రమేశ్‌కు బెయిల్ రాలేదు. దీంతో జైల్లోనే జోగి సోదరులు ఇంకా జైల్లోనే ఉండనున్నారు. అంతకుముందు.. జోగి రమేశ్‌ను విజయవాడ జిల్లా జైలు నుంచి చెయ్యి నొప్పి కారణంగా ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను తిరిగి విజయవాడ జైలుకు తరలించారు. నకిలీ మద్యం తయారీకి సంబంధించి జోగి రమేశ్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో జోగి సోదరులను నిందితులుగా పోలీసులు చేర్చారు. ప్రాథమిక విచారణలో భాగంగా ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు జోగి సోదరులను విచారించారు. ఈ విచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విచారణ ఆధారంగా పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు.

## ట్రాఫిక్ క్లియర్‌లో ప్రత్యేక శ్రద్ధ

**- కానిస్టేబుల్ జయశాంతికి హోంమంత్రి అభినందన**

**అమరావతి, జనవరి20( వెలుతురు):**
మహిళా కానిస్టేబుల్ జయశాంతికి ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అభినందనలు తెలిపారు. కాకినాడలోని కెనాల్ రోడ్డులో గత శనివారం భారీ ట్రాఫిక్ జామ్ అవ్వగా.. దానిని కానిస్టేబుల్ జయశాంతి క్లియర్ చేశారు. ఈ వ్యవహారంపై హోంమంత్రి అనిత స్పందిస్తూ.. ఆమెకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. జయశాంతి లాంటి పోలీసుల వల్ల ప్రజలకు మరింత నమ్మకం పెరిగిందని మంత్రి అనిత తెలిపారు. జయశాంతి కుటుంబం యోగక్షేమాలను కూడా అడిగి తెలుసుకున్నారు అనిత. ఈ క్రమంలో తాను హోంమంత్రిని కలుస్తానని జయశాంతి చెప్పారు. త్వరలోనే కలుద్దామని హోం మంత్రి చెప్పారు. ఈ సంఘటన మహిళా పోలీసుల సాహసాన్ని, విధి నిర్వహణలో వారి పాత్రను ప్రదర్శించే ఒక మంచి ఉదాహరణగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. కాకినాడలోని కెనాల్ రోడ్డులో శనివారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. సామర్లకోట వద్ద ఓ లారీ సాంకేతిక సమస్య కారణంగా రైల్వే గేట్ సమీపంలో రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో సుమారు ఐదారు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సమయంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి రంగంపేటకు చెందిన మహిళా కానిస్టేబుల్ జయశాంతి విధి నిర్వహణలో లేకపోయినా తన బిడ్డను చంకనెత్తుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## మద్యం డబ్బులు చెల్లించండి .. డిస్టలరీస్ వార్నింగ్..

**హైదరాబాద్, జనవరి20( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వం నుంచి రావాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలు ఇప్పుడు రాష్ట్ర పారిశ్రామిక ప్రతిష్టను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక 2026 దావోస్ సదస్సు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో, మద్యం తయారీ పరిశ్రమల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేశాయి. సుమారు రూ. 3,900 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించకపోతే, రాష్ట్రానికి వచ్చే కొత్త పెట్టుబడులు ఆగిపోవడమే కాకుండా, ప్రస్తుతం ఉన్న ఇన్వెస్టర్ల నమ్మకం కూడా సన్నగిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి.బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా , కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బెవరేజెస్ కంపెనీస్) సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి. తెలంగాణ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ తమకు రూ. 3,900 కోట్లు చెల్లించాల్సి ఉందని, అందులో రూ. 900 కోట్లు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించాయి. డియాజియో, పెర్నోడ్ రికార్డ్, యునైటెడ్ బ్రూవరీస్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులు ఈ బకాయిల అంశంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు."రాష్ట్ర ఖజానాకు మద్యం రంగం భారీగా ఆదాయాన్ని సమకూరుస్తుంది. ఒప్పందం ప్రకారం 45 రోజుల్లో చెల్లింపులు చేయాల్సి ఉండగా, నెలల తరబడి జాప్యం చేయడం వల్ల సరఫరా గొలుసు దెబ్బతింటుంది. ఇది ఉద్యోగాలపై కూడా ప్రభావం చూపుతుంది" అని ఈ




మూడు సంఘాలు పేర్కొన్నాయి.తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులు గత ఏడాదితో పోలిస్తే సగానికి పైగా పడిపోయాయి. 2023-24లో రూ. 28,100 కోట్లుగా ఉన్న పెట్టుబడులు, 2024-25 నాటికి రూ. 13,730 కోట్లకు పడిపోవడం గమనార్హం. బకాయిల చెల్లింపులో జాప్యం కూడా ఇందుకు ఒక కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, తెలంగాణ ఎక్సైజ్ ఆదాయం గత పదేళ్లలో నాలుగు రెట్లు పెరిగింది. 2013-14లో రూ. 9,000 కోట్లుగా ఉన్న ఆదాయం, 2023-24 నాటికి రూ. 38,000 కోట్లకు చేరుకుంది. కేవలం అక్టోబర్ 2025లోనే లైసెన్స్ ఫీజుల ద్వారా ప్రభుత్వం రూ. 3,000 కోట్లు వసూలు చేసింది. ఇంత భారీ ఆదాయం వస్తున్నా, సరఫరాదారులకు బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని కంపెనీలు ప్రశ్నిస్తున్నాయి."ముఖ్యమంత్రిని 2024 జూలైలో కలిసినప్పుడు మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ 2025 జనవరి నాటికి మళ్లీ చెల్లింపులు ఆగిపోయాయి. ఇది చాలా క్లిష్టమైన పరిస్థితి" అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక మద్యం కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలో బీర్ మార్కెట్‌లో 70 శాతం వాటా కలిగిన యునైటెడ్ బ్రూవరీస్ ఇప్పటికే కు సరఫరా నిలిపివేసింది. పెరిగిన ముడిసరుకు ఖర్చులకు అనుగుణంగా ధరలు సవరించకపోవడం, పాత బకాయిలు పేరుకుపోవడంతో కార్యకలాపాలు నిర్వహించడం భారంగా మారిందని సంస్థ తెలిపింది. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో పన్నుల పెంపు వల్ల సేల్స్ తగ్గిన నేపథ్యంలో, మద్యం కంపెనీలకు తెలంగాణ కీలక మార్కెట్. కానీ ఇక్కడి చెల్లింపుల జాప్యం వారిని అయోమయంలో పడేస్తోంది.వెంటనే లైసెన్స్ వేలం ద్వారా వచ్చిన నిధులతో బకాయిలు చెల్లించి, ఇన్వెస్టర్లలో భరోసా నింపాలని పరిశ్రమ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

## సిట్టు..లట్టు..పొట్టుకు భయపడం

- **సిట్ ఎన్నిసార్లు పిలిచినా వెళ్తాం,**
- **ఫోన్ ట్యాపింగ్‌లో నిరాధార ఆరోపణలు**
- **సింగరేణి వ్యవహారంతో దృష్టి మరల్చే కుట్ర,**
- **దాదాపు 7 గంటలపాటు ప్రశ్నించిన సిట్,**
- **మీడియా సమావేశంలో బిఆర్ఎస్**

**ఎమ్మెల్యే హరీష్ రావు**



**హైదరాబాద్,జనవరి20 వెలుతురు:**
కేసులు, అరెస్టులు మాకు కొత్త కాదని.. ఎన్ని కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సిట్టు, లట్టు, పొట్టుకు మేం భయపడమని.. సిట్ ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వెళ్తానని స్పష్టం చేశారు. మంగళవారం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నాపై నిరాధార ఆరోపణలు చేశారని.. విచారణ పేరుతో సమయం వృధా చేశారని అన్నారు. నోటీసులు వస్తే పారిపోమని.. ఎన్ని విచారణలు అయినా ఎదుర్కొంటామన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం సమైక్య రాష్ట్రంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నామని చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే కేసులు పెడుతున్నారని.. కేసులు, అరెస్టులు మాకు కొత్తేమి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలకు నిలయంగా మారిందని.. మంత్రుల మధ్య వాటాల పంచాయతీ నడుస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సింగరేణిలో వేల కోట్ల రూపాయల కుంభకోణానికి తెరతీశాడని.. ఈ స్కామ్‌ను బట్టబయలు చేసినందుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు స్కాంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారు.. ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. దమ్ముంటే నన్ను విచారణ చేసినప్పుడు తీసిన వీడియో బైట పెట్టాలని.. అంతే కానీ చిల్లర లీకులు ఇవ్వొద్దని అన్నారు. ఇది లీకుల ప్రభుత్వం, స్కాముల ప్రభుత్వమని విమర్శలు గుప్పించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు ముందే ఉన్నాయన్నారు. ఇదిలావుంటే ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంత్రి హరీష్ రావు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 7 గంటల పాటు సిట్ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. హరీష్ రావు స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. విచారణ ముగిసిన తర్వాత జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి నేరుగా ఆయన తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని సోమవారం హరీష్ రావుకు సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. సిట్ నోటీసుల మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లోని సిట్ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరయ్యారు. సిట్ చీఫ్ సజ్జనార్ నేతృత్వంలో దాదాపు ఏడు గంటల పాటు అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మీ పాత్ర ఏంటి..? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేయించారని సిట్ ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం.

సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోనే హరీశ్ రావును సిట్ విచారిస్తున్నట్టు తెలిసింది. చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హరీశ్ రావు అనుచరులను పంజాగుట్ట పోలీసులు గతంలోనే అరెస్ట్ చేశారు. సిట్ కూడా వారి స్టేట్‌మెంట్లు రికార్డ్ చేసినట్టు తెలిసింది. ఐ న్యూస్ మాజీ ఎండీ శ్రవణ్ రావుతో కలిసి హరీశ్ రావు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు సిట్ ఆధారాలు సేకరించింది. ఈ క్రమంలోనే హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసింది. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సహా నిందితులైన మాజీ పోలీస్ అధికారుల వాంగ్మూలాలు, టెలికం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి అందిన 618 నంబర్లకు చెందిన ఫోన్ ట్యాపింగ్ లిస్ట్ ఆధారంగా సిట్ దర్యాప్తు చేస్తున్నది. ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, జైపాల్ యాదవ్‌ను ఇప్పటికే విచారించింది. వాళ్ల నియోజకవర్గాల్లో ప్రత్యర్థులు సహా వ్యాపారవేత్తల ఫోన్ ట్యాపింగ్ వివరాలు సేకరించింది.

## ట్రాఫిక్ చక్ర బంధనం నుంచి బయటకు ఎలా...

**హైదరాబాద్, జనవరి20( వెలుతురు):**
తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో సైబర్ నేరాలను, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరాను ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రస్తుతం, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టారు. ఆ దిశగా యువ ఐపిఎస్ అధికారులకు ఆ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతో పాటు కొత్తగా రూపుదిద్దుకుంటున్న 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ బదిలీల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.జిల్లాల్లో అదనపు ఎస్పీలుగా సమర్థవంతంగా పనిచేస్తున్న యువ అధికారులను ఎంపిక చేసి, వారికి నగరంలో ట్రాఫిక్ డిసిపిలుగా పోస్టింగులు ఇచ్చారు. ఈ బదిలీల్లో భాగంగా కొత్తగూడెం ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా ఉన్న అవినాష్ కుమార్ ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి-1 (ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు) గానూ, ఉట్నూరు అదనపు ఎస్పీగా ఉన్న కాజల్ ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి-2 (గోల్కొండ, జూబ్లీహిల్స్ జోన్లు) గానూ నియమించారు. అదేవిధంగా జగిత్యాల అదనపు ఎస్పీ ఎస్. శేషాద్రిని రెడ్డిని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి-2 (కూకట్‌పల్లి,




కుత్బుల్లాపూర్ జోన్లు) బాధ్యతల్లోకి తీసుకురాగా, భువనగిరి అదనపు ఎస్పీ కనకాల రాహుల్ రెడ్డికి మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ డిసిపి-1 బాధ్యతలు అప్పగించారు.ములుగు జిల్లా ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న శివం ఉపాధ్యాయను ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్ ట్రాఫిక్ డిసిపిగా నియమించడం విశేషం. రైల్వేస్ డిఐజి హోదాలో ఉన్న జి. చందనా దీప్తిని ఫ్యూచర్ సిటీ అడ్మిన్ మరియు ట్రాఫిక్ అదనపు సీపీగా నియమించగా, హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న బికే రాహుల్ హెగ్డేను అదే కమిషనరేట్ లో ట్రాఫిక్ డిసిపి-3 (చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లు) గాను, సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న జి. రంజన్ రతన్ కుమార్ ను అక్కడే ట్రాఫిక్ డిసిపి-1 (శేర్లింగంపల్లి జోన్) గాను ప్రభుత్వం బదిలీ చేసింది.అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా వంటి అక్రమాలను అడ్డుకునేందుకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్‌లో డిఐజి గా అభిషేక్ మహంతిని నియమించారు. తద్వారా సహజ వనరుల లూటీని అరికట్టడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా కఠిన చర్యలు చేపట్టనున్నారు. మొత్తంగా చూస్తే, తాజా ఐపిఎస్ అధికారుల బదిలీల్లో అటు అనుభవానికి, ఇటు యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## ప్రశాంతంగా ముగిసిన టెట్ పరీక్షలు

**- 30న కీ విడుదల చేయనున్నట్లు వెల్లడి**

**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
తెలంగాణలో టెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి.. జనవరి 3న ప్రారంభమైన టెట్ పరీక్షలు జనవరి 20 వరకు జరిగాయి. ఈ సందర్భంగా టెట్ కన్వీనర్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు . రాష్ట్రవ్యాప్తంగా టెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని.. జనవరి 30న టెట్ పేర్క్షలకు సంబందించిన కీ విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈసారి టెట్ పరీక్షకు మొత్తం 82.09 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు ప్రకటించారు టెట్ కన్వీనర్. టెట్ పేపర్-1, 2లకు కలిపి మొత్తం రెండు లక్షల 38 వేల మంది దరఖాస్తు చేసుకోగా..82.9 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఈసారి




ఇన్ సర్వీసు టీచర్లు 71 వేల 670 మంది టెట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ తప్పనిసరి అంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన క్రమంలో ఈసారి భారీ సంఖ్యలో పోటీ నెలకొంది. టెట్ ఫలితాలు ఫిబ్రవరి 10 నుంచి 16 తేదీల మధ్య విడుదలవుతాయని తెలుస్తోంది.

# గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో ట్రంప్ దూకుడు

**- యుద్ధ విమానం మొహరించేందుకు సిద్ధమైన అమెరికా**

**- తాజా పరిణామాలతో సర్వత్రా ఆందోళన**

**వాషింగ్టన్,జనవరి20( వెలుతురు:**

గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం వద్ద యుద్ధ విమానాన్ని మోహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ చేసిన ప్రకటన ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ పరిణామాలతో గ్రీన్‌లాండ్ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ ఏ క్షణాన ఏ ప్రకటన చేస్తారో, ఏ చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకోవాలనే అమెరికా ఆశలను ఉద్దేశిస్తూ.. ఫ్రాన్స్ బహిరంగ విమర్శలు చేసింది. అమెరికా, కెనడా సంయుక్త రక్షణ సంస్థ అయిన 'నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్' తాజాగా గ్రీన్‌లాండ్‌కు సంబంధించి తమ సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. త్వరలోనే తమ సైనిక విమానం పిటుఫిక్ స్పేస్ బేస్‌కు చేరుకుంటుందని అందులో వెల్లడించింది. ఈ ప్రాంతంలో రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన తమ దీర్ఘకాల ప్రణాళికల్లో భాగంగా ఈ మోహరింపు చేపట్టనున్నట్లు పేర్కొంది. కెనడా, డెన్మార్క్ రాజ్యం



సమన్వయంతో ఈ కార్యకలాపాలు జరగనున్నాయని, గ్రీన్‌లాండ్ ప్రభుత్వానికి దీని గురించి ముందుగానే సమాచారం అందించామని నోరాడ్ తెలిపింది. అయితే దీనిపై డెన్మార్క్ నుంచి ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదు. అమెరికా దుందుడుకు చర్యల నేపథ్యంలో డెన్మార్క్ పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను గ్రీన్‌లాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. బలగాలు, సైనిక పరికరాలను మోసుకెళ్లిన అనేక విమానాలు సోమవారం గ్రీన్‌లాండ్‌కు చేరుకున్నాయని పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఎందుకు దృష్టిసారించారనే దానిపై అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భవిష్యత్తులో రష్యా నుంచి వచ్చే ముప్పు నుంచి కాపాడుకోవడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనిపై ఫ్రాన్స్ విదేశాంగ శాఖ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు చేసింది. 'ఏదోఒక రోజు మంటలు చెలరేగితే.. అగ్నిమాపక సిబ్బంది రావాల్సి ఉంటుంది. కాబట్టి ఇప్పుడే ఇంటిని తగలెట్టేయడం మంచిది. ఏదో ఒకరోజు కారుకు ప్రమాదం జరిగితే నష్టం వాటిల్లుతుంది. కాబట్టి ఇప్పుడే కారుకు యాక్సిడెంట్ చేయడం మంచిదని అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. ఇక, గ్రీన్‌లాండ్ సాధించుకునేందుకు అగ్రరాజ్యం చేస్తున్న ప్రయత్నాలపై ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్క్యూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాలు ఈయూ, అమెరికా మధ్య ఉన్న వాణిజ్య, ఆర్థిక సంబంధాలను ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు.

## జాతీయగీతాలపనకు నిరాకరణ

**- తమిళ అసెంబ్లీ నుంచి నిష్క్రమించిన గవర్నర్**



**చెన్నై, జనవరి20(వెలుతురు:**

తమిళనాడు శాసనసభ సమావేశంలో తన ప్రసంగాన్ని చదవకుండానే గవర్నర్ ఆర్.ఎన్.రవి నిష్క్రమించారు. ఈ ఏడాది శాసనసభ తొలి సమావేశం మంగళవారం ప్రారంభం కాగా తన ప్రసంగాన్ని చదవకుండానే ఆయన వాకౌట్ చేశారు. తమిళతల్లి ప్రార్థనా గీతం తర్వాత జాతీయగీతం ఆలపించాలని సభాపతిని గవర్నర్ కోరగా అందుకు నిరాకరించడంతో ఆయన వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అన్ని శాసనసభల్లోనూ గవర్నర్ ప్రసంగానికి ముందు, తర్వాత జాతీయగీతాన్ని పాడతారని, ఇక్కడ ప్రసంగానికి ముందు ఆలపించాలని కోరినా ఉద్దేశపూర్వకంగానే నిరాకరించారని లోక్‌భవన్ వెల్లడించింది.

## బైంసాలో ఘోర రోడ్డు ప్రమాదం

**- కారును ఢీకొన్న కంటెయినర్**

**- ప్రమాదంలో నలుగురు దుర్మరణం**



**నిర్మల్,జనవరి 20( వెలుతురు:**

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భైంసా బస్ డిపో సమీపంలో కారు– కంటైనర్ లారీ ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. మృతులు నిర్మల్ జిల్లా కుబేర్ మండలం కుప్టి గ్రామానికి చెందిన వారిగా తెలుస్తోంది. మృతుల్ని బాబన్న, భోజరాం పటేల్, రాజన్న, వికాస్‌గా గుర్తించారు. ఈ నలుగురు హైదరాబాద్ నుంచి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. కారు అదుపుతప్పి కంటైనర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనతో రోడ్డుపై రాకపోకలకు ఆటంకం కలిగింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

**- 12మంది ప్రయాణికులకు గాయాలు**




**భద్రాద్రి కొత్తగూడెం,జనవరి20( వెలుతురు:**

రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళుతున్న ట్రావెల్స్ స్లీపర్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గట్టుగూడెం వద్ద ఈ ప్రమాదం జరిగింది. బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 43 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. బస్సు అశ్వారావుపేట దాటి సుమారు 20 కిలోమీటర్లు వెళ్లిన తర్వాత గట్టుగూడెం వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడినట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను పోలీసు వాహనాలు, అంబులెన్సుల ద్వారా సమీప ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## నటుడు అక్షయ్ కుమార్ కు తప్పిన ప్రమాదం

**- కారు ప్రమాదంతో తప్పిన ముప్పు**

**ముంబై, జనవరి20 ( వెలుతురు:**



బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ వాహనానికి సోమవారం రాత్రి భారీ ప్రమాదం జరిగింది. అక్షయ్ కుమార్, ఆయన భార్య ట్వింకిల్ ఖన్నా విదేశీ పర్యటన నుంచి తిరిగి వస్తుండగా కాన్వాయ్ లోని ఒక ఎస్కార్ట్ వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినగా, ఆటో డ్రైవర్‌తో పాటు ఒక ప్రయాణికుడికి గాయాలయ్యాయి. అక్షయ్, ట్వింకిల్ ప్రయాణిస్తున్న కారుకి స్వల్పంగా దెబ్బ తగిలినప్పటికీ.. వారిద్దరూ సురక్షితంగా ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణం ముంబై జుహూ ప్రాంతంలో వేగంగా వచ్చిన ఒక మెర్సిడెస్ కారు ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆ ఆటో అదుపు తప్పి రోడ్డుకు అవతలివైపు ప్రయాణిస్తున్న అక్షయ్ ఎస్కార్ట్ కారును ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కాంగ్రెస్ పాలనలో పడకేసిన పట్టణాభివృద్ధి

**- ఉమ్మడి జిల్లాలో మళ్లీ గెలుపు మాదే**

**- బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్న వేముల**

**నిజామాబాద్,జనవరి20( వెలుతురు:**

పట్టణపోరు లోనూ బిఆర్ఎస్ సత్తా చాటుతుందని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలే మన పార్టీ బలానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. మున్సిపాలిటీలో ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. అధికారంలోకి రాకముందు పట్టణాల పరిస్థితి ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా మారిందో ప్రజలందరికీ తెలుసన్నారు. బిఆర్ఎస్ రాకముందు పట్టణాల్లో మురికి కాలువలు, చెడిపోయిన రోడ్లు, అపరిశుభ్రతతో ఉండేదని, తాము పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోనే పట్టణాలను మార్చగలిగామని, రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. అదేవిధంగా ఆర్అండ్‌బీ శాఖ ద్వారా సెంట్రల్ లైటింగ్, డివైడర్ల కోసం నిధులు తీసుకురాగలిగామని చెప్పారు. ప్రతి వెయ్యి ఓట్లు ఉన్న వార్డుకు సుమారు రూ.6 కోట్ల వరకు నిధులు కేటాయించేలా అభివృద్ధి చేశామని వివరించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లనీరు అందించామని, నియోజకవర్గానికో వంద పడకల



ప్రభుత్వ ఆసుపత్రి, రైతుల కోసం చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ అభివృద్ధి కారణంగానే మున్సిపాలిటీలో ఓటు అడిగే హక్కు మాకే ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మనం మంజూరు చేసిన నిధులతో పనులు కూడా పూర్తి చేయడం లేదని తీవ్ర విమర్శలు చేశారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేయకుండా, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల ముందు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటింటికి తిరిగి గ్యారంటీ కార్డులు కాంగ్రెస్ నాయకులతో పంచించారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గ్యారంటీలను పూర్తిగా అటకెక్కించారని విమర్శించారు. అందుకే బీఆర్ఎస్ పార్టీ 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను రూపొందించిందని, ఈ కార్డుల ద్వారా గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఎంత బాకీ పడిందో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రూ.2500 చేయూత పెన్షన్, రూ.4000 ఆసరా పెన్షన్ పెంపు, తులం బంగారం, విద్యా భరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీలు, రెండు లక్షల ఉద్యోగాలు, 4000 నిరుద్యోగ భృతి, రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా రూ.15,000, ప్రతి పంటకు రూ.500 బోనస్ వంటి అనేక హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగడానికి ఇంటికి వచ్చినప్పుడు ఈ బాకీ కార్డును చూపించి, హామీలు నెరవేర్చితేనే ఓటు వేస్తామని, లేకపోతే ఓడిస్తామని ప్రజలు స్పష్టంగా చెప్పాలని పిలుపునిచ్చారు. పార్టీలో టికెట్లు ఆశించే వారు ఎంతమంది ఉన్నా, ఎవరికి టికెట్ వచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేసి గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రజలు ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని వేముల ప్రశాంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# వేధింపుల కేసులు మీకు అలవాటు

**- మీ హయాంలో నేనూ బాధితుడినే**

**- కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ బల్మూరి వెంకట్**

**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**

బిఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ నేతలపై అనేక వేధింపు కేసులు పెట్టిన విషయం మరిచనట్లు ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ కోసం హరీశ్ రావు అవయవాలు దానం చేసినట్లు.. బామ్మర్ది పోయి బావను పరామర్శిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అత్యధికంగా కేసులు పెట్టి తనను ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. 'గాంధీ భవన్ లోపలికి వచ్చి అర్ధరాత్రి నన్ను అరెస్ట్ చేశారు. నా కుటుంబ సభ్యులు సహా మా వాచ్‌మెన్ ఫోన్ కూడా ట్యాప్ చేశారు. రేవంత్ రెడ్డిపై డ్రోన్ కేసు పెట్టి 14 రోజులు జైల్లో పెట్టలేదా? గత ప్రభుత్వంలో ఎథికల్ హ్యాకర్‌ను ట్రైనింగ్ కోసం బయటి దేశాలకు పంపారా? లేదా.? నేను ఎక్కడికైనా వచ్చి ప్రమాణం చేస్తా, మీరూ వచ్చి ప్రమాణం చేస్తారా?' అని ఎమ్మెల్సీ వెంకట్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన ఆరోపణలకు బల్మూరి కౌంటర్ ఇస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తంలో స్కామ్‌లే అని కేటీఆర్ అంటున్నారని.. ఆధారాలుంటే బయటపెట్టాలని ఛాలెంజ్



చేశారు. కల్వకుంట్ల కుటుంబ గూడుపుటానీలో కవిత భాగస్వామి అని.. అందుకే ఆమెను బయటకు పంపారన్నారు. కేటీఆర్ పదే పదే సృజన్ రెడ్డి అని ఆరోపణలు చేస్తున్నారని.. ఆయన చెప్పున్న సృజన్ రెడ్డి.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అల్లుడేనని బల్మూరి వివరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి వెంకట్ మాట్లాడుతూ.. చక్రధర్ గౌడ్ వేసిన కేసును సుప్రీంకోర్టు కొట్టేసిందని.. ఫోన్ ట్యాపింగ్ కేసుకు దానికి సంబంధం లేదన్నారు. ఏ విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. 'లోపల జరుగుతున్న విచారణ మీకు ఎలా తెలుసు? మీకు ఎవరైనా కోవర్టులు ఉన్నారా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు ఎమ్మెల్సీ బల్మూరి.

## ధాన్యం కొన్న వెంటనే నగదు జమ

**- అధికారులకు మంత్రి నాదెండ్ల ఆదేశం**



**విజయవాడ,జనవరి20( వెలుతురు):**

ఇకపై ఉదయం ధాన్యం కొంటే.. అదే రోజు సాయంత్రానికి నగదు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. రబీ ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని.. రైతు సేవా కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించేలా శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 6,83,623 మంది రైతుల నుంచి రూ.9,890 కోట్ల విలువైన 41.69 లక్షల టన్నుల ధాన్యం సేకరించామని.. అందులో రూ.9,800 కోట్లు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలోని పౌరసరఫరాలశాఖ కమిషనరేట్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరుపతి, నెల్లూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కొనసాగుతుందని ఆయన వివరించారు. 'రైతులు ఇబ్బంది పడకుండా తొలిసారిగా ప్రత్యేక రైలు ఏర్పాటు చేసి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ధాన్యం తరలిస్తున్నాం. తేమ శాతం, జీపీఎస్, రవాణా సమస్యలు సమర్థంగా అధిగమించాం' అని మనోహర్ పేర్కొన్నారు. రబీలోనూ గోతాలు, రవాణా, నిల్వ సౌకర్యాల్లోనూ ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ వీసీ, ఎండీ ఢిల్లీరావు, అధికారులు పాల్గొన్నారు.

# సినిమా టిక్కెట్ రేట్లు పెంపుదలపై హైకోర్టు ఆగ్రహం

**- హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆనంద్‌కు నోటీసులు**

**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**

సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ హైకోర్టు మరోసారి కీలక ఆదేశాలు జారీ చేసింది. 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాకు టికెట్ రేట్లు పెంచుకునేందుకు హోం శాఖ జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ వ్యవహారంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీవీ ఆనంద్‌కు హైకోర్టు సుమోటో కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. గత ఆదేశాలను ధిక్కరిస్తూ మన శంకరవరప్రసాద్ గారు చిత్రానికి ధరలు పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యవహారంపై దాఖలైన పిటిషన్ పై అడ్వకేట్ విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. హోంశాఖ అధికారులు గత ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారని వాదించారు. మన శంకర వరప్రసాద్ సినిమా టికెట్ల రేట్లు పెంచిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకురాకుండా దాచిపెట్టారంటూ పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ క్రమంలోనే సీవీ ఆనంద్‌కు హైకోర్టు కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ సినిమాస్ రెగ్యులేషన్ యాక్ట్–1955 ప్రకారమే ధరల నిర్ణయాలు తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమాకైనా టికెట్ ధరల పెంపు నిర్ణయం తీసుకునేటప్పుడు 90 రోజుల ముందే ప్రకటించాలని హైకోర్టు ఆదేశించింది. గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా మళ్లీ ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.




https://epaper.velthuru.com

వెలుతురు

# cinema

## బాబీ దర్శకత్వంలో చిరు తదుపరి సినిమా

ఓవైపు థియేటర్లలో 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్ర సందడి కొనసాగుతుండగా.. మరోవైపు చిరంజీవి తదుపరి చిత్ర పనులు చకచకా సాగిపోతున్నాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబు కానున్న ఈ సినిమా వచ్చే నెలలో లాంఛనంగా మొదలు కానుంది. మార్చి నుంచి చిరు రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పుడీ చిత్ర కథాంశానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇది కూతురి సెంటిమెంట్‌తో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని సమాచారం. దీంట్లో మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో అలరిస్తారని.. ఈ కథలో తన పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.




## శర్వానంద్‌కు కలసి వచ్చిన బాలయ్య సెంటిమెంట్

టాలీవుడ్‌లో కొన్ని చిత్రాలకు సంబంధించిన విశేషాలు భలే ఆసక్తికరంగా మారుతుంటాయి. అలాంటి సంఘటన ఒకటి హీరో శర్వానంద్ నటించిన నారి నారి నడుమ మురారి సినిమాకు జరిగింది. శర్వా హీరోగా రామ్ అబ్బరాజు డైరెక్షన్ లో అనిల్ సుంకర నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి సూపర్ హిట్ గా నిలిచింది. ఫెస్టివల్ సీజన్‌లో వచ్చిన చిత్రాల్లో చిన్న సినిమాగా వచ్చి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ బాక్సాఫీస్ వద్ద బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా మారింది.ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. దాదాపు 36 ఏళ్ల క్రితం నందమూరి బాలకృష్ణ హీరోగా, ఏ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో 'నారి నారి నడుమ మురారి' అనే సినిమా విడుదలై అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచింది. అందుకే అదే టైటిల్‌ను శర్వానంద్ సినిమా కోసం ఫిక్స్ చేయగానే, అది బాలకృష్ణ సినిమా టైటిల్ కదా అని ఆయన అనుమతి తీసుకోవాలని శర్వానంద్ స్వయంగా బాలకృష్ణకు ఫోన్ చేసి విషయం వివరించగా, ఈ విషయం నాకెందుకు చెప్తున్నావు, నిరభ్యంతరంగా టైటిల్ పెట్టుకో అంటూ బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అంతేకాదు, టైటిల్ పెట్టుకోమని చెప్పడమే కాకుండా సినిమా షూటింగ్‌కు, టైటిల్ రివీల్ కు ముహూర్తం కూడా బాలకృష్ణ ఫిక్స్ చేశారట. ఇక భారీ సినిమాల మధ్య పోటీగా రిలీజ్ అయినా నారి నారి నడుమ మురారి శర్వా కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచి ఇటు నిర్మాతలకు అటు డిస్ట్రిబ్యూటర్స్ కు భారీ లాభాలు తెచ్చిపెడుతోంది. ఈ విషయాన్నీ బాలయ్యకు చెప్పేందుకు శర్వానంద్ మరోసారి కాల్ చేయగా 'నా పేరు కాపాడావు? సినిమా సూపర్ హిట్ అయిందని తెలిసింది. ఇలానే రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలు చేయాలి' అంటూ శర్వానంద్‌ను దీవించారట బాలయ్య. ఆ సంతోషాన్ని తన ఫ్రెండ్స్ తో షేర్ చేసుకుంటూ ఇక నుంచి నా సినిమాలన్నింటికీ బాలయ్యతోనే ముహూర్తం పెట్టించుకుంటాను అని అన్నారట. మొత్తానికి, బాలయ్య టైటిల్ తో ఆయన పెట్టిన ముహూర్తంతో శర్వానంద్‌కు భారీ హిట్ అందుకున్నాడు.




## మారుతి తదుపరి ప్రాజెక్ట్‌పై ఊహాగానాలు

టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మారుతి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు, ప్రభాస్‌తో చేసిన ప్రతిష్టాత్మక చిత్రం 'రాజా సాబ్' అనంతరం ఆయన తదుపరి ప్రాజెక్టుల గురించి సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు



షికారు చేస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై తాజాగా ఒక స్పష్టత వచ్చింది, నిజానికి గత కొన్ని రోజులుగా మారుతి ఒక మెగా హీరోతో సినిమా చేయబోతున్నారని, స్క్రిప్ట్ పనులు కూడా పూర్తయ్యాయని కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. దీనికి తోడు కొన్ని నిర్మాణ సంస్థల పేర్లు, నిర్మాతల పేర్లు కూడా తెరపైకి వచ్చాయి, ఈ ప్రచారం కాస్తా వైరల్ కావడంతో అభిమానుల్లో అయోమయం నెలకొంది. తాజా సమాచారం ప్రకారం, మారుతి తదుపరి సినిమా గురించి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వార్తలన్నీ కేవలం పుకార్లు మాత్రమే, అవి పూర్తిగా నిరాధారమైనవని, అందులో ఎటువంటి వాస్తవం లేదని ఆయన పీఆర్ టీమ్ ప్రకటించింది, కేవలం క్లిక్ బైట్స్ కోసం లేదా అంచనాల కోసం సృష్టించిన వార్తలుగా వీటిని పరిగణించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. మారుతి తన ప్రతి ప్రాజెక్టును చాలా ప్లాన్డ్‌గా అనౌన్స్ చేస్తుంటారు, ఒకవేళ తన తదుపరి సినిమా ఖరారైతే, ఆ వివరాలను ఆయన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా, సంబంధిత నిర్మాణ సంస్థల అధికారిక ప్రకటనల ద్వారా వెల్లడిస్తారు అని పేర్కొన్నారు. అనధికారిక మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని షేర్ చేయడం వల్ల అనవసరమైన గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని మారుతి సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

### హీరో నవీన్ పోలిశెట్టి తదితరుల రాక

కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మంగళవారం వీఐపీ ప్రారంభ దర్శనంలో స్వామివారిని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు దర్శించుకున్నారు. టాలీవుడ్ హీరోహీరోయిన్లు నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి, హీరో శివబాలాజీలతోపాటు దర్శకుడు మారి, రచయిత చిన్మయ్ దర్శించుకున్నారు. ఆటో రాంప్రసాద్, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, రాంభూపాల్ రెడ్డి స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారి ఆలయం వెలుపల నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి మాట్లాడారు. అనగనగా ఒక రాజు చిత్రం ఘన విజయం సాధించిందన్నారు. తిరుమల వెంకన్న తన ఇష్టదైవమని తెలిపారు. శ్రీవారి ఆశీస్సులతోనే ఈ చిత్రం ఇంతటి ఘన విజయాన్ని అందుకుందని అన్నారు. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. సోమవారంతోనే ఈ చిత్రం రూ.100 కోట్ల మార్క్ దాటిందని హీరో నవీన్ పోలిశెట్టి తెలిపారు. తన ప్రతి చిత్రం విజయం సాధిస్తే తిరుమలకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటానని చెప్పారు. ప్రస్తుతం తాను రెండు చిత్రాల్లో నటిస్తున్నానని పేర్కొన్నారు. ఇక హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగచైతన్యతో పాటు పలు చిత్రాల్లో తానూ నటిస్తున్నానన్నారు. నాగ చైతన్యతో నటిస్తున్న చిత్రం ఈ ఏడాది విడుదల అవుతుందని హీరోయిన్ మీనాక్షి చౌదరి వెల్లడించారు.



## ఇవివి తండ్రి సత్యనారాయణ మృతి

సినీ నటుడు అల్లరి నరేశ్ ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆయన తాత ఈవీవీ సత్యనారాయణ తండ్రి ఈవీవీ వెంకట్రావు (90) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న వెంకట్రావు మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నిడదవోలు మండలం కోరుమామిడిలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన సతీమణి వెంకటరత్నం 2019లో మరణించారు. వెంకట్రావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ఈవీవీ సత్యనారాయణ 2011 జనవరి 21న మృతి చెందిన విషయం తెలిసిందే.



## విజయ్ సేతుపతితో మణిరత్నం సినిమా హీరోయిన్‌గా సాయిపల్లవి ఖరారు

తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్స్ట్ సినిమాపై కోలీవుడ్ లో ఒక ఆసక్తికర చర్చ జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ సేతుపతి ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల శింబు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదట. దీంతో అదే కథకు విజయ్ సేతుపతిని హీరోగా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతికి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు.



ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత విజయ్ సేతుపతి కెరీర్‌లో ఈ మణిరత్నం సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలా ఎ÷-లాన్ చేస్తున్నారట. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఆలోచింప చేసే అద్భుత సినిమా దండోరా సినిమాను చూసి మెచ్చుకున్న ఎన్టీఆర్

తెలుగులో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు ప్రశంసలు అందుకున్న 'దండోరా' సినిమాపై అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రశంసల వర్షం కురిపించాడు . ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'ఇప్పుడే దండోరా సినిమా చూశాను. ఇది ఎంతో లోతైన, శక్తివంతమైన మరియు ఆలోచింపజేసే చిత్రం. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవిలు తమ నటనతో సినిమా ఆద్యంతం అద్భుతంగా రాణించారు. ఇంతటి బలమైన రచనతో, మన మూలాలకు దగ్గరగా ఉండే కథను ఎంతో చక్కగా తెరకెక్కించిన దర్శకుడు మురళీ కాంత్ గారికి నా హ్యాట్సాఫ్. ఇలాంటి గొప్ప ప్రయత్నాన్ని ప్రోత్సహించి, నిర్మించిన రవీంద్ర బెనర్జీ గారికి అభినందనలు. ఈ గొప్ప చిత్రంలో భాగమైన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అంటూ జూనియర్ ఎన్టీఆర్ రాసుకోచ్చాడు. అయితే ఎన్టీఆర్ లాంటి గ్లోబల్ స్టార్ నుంచి ప్రశంసలు అందడంతో చిత్ర యూనిట్ అమితానందంలో మునిగిపోయింది. 'ఎన్టీఆర్ అన్న నా పేరు పలికారు, ఇది నాకు చాలు' అంటూ దర్శకుడు మురళీ కాంత్ భావోద్వేగానికి లోనవ్వగా, నిర్మాత ఇది తమకు అసలైన విజయం అని సంతోషం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎన్టీఆర్ ప్రశంసలతో ఈ సినిమాకు ఒక్కసారిగా విపరీతమైన క్రేజ్ పెరగడమే కాకుండా, ప్రస్తుతం ఇండియాలో అమెజాన్ ప్రైమ్ టాప్-2లో ట్రెండింగ్‌లో నిలుస్తూ రికార్డు సృష్టిస్తోంది.

## దృశ్యం-3 కోసం వెంకటేశ్ బిజీ

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం చిరంజీవితో కలిసి 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రంతో థియేటర్లలో నవ్వులు పంచుతున్న సంగతి తెలిసిందే. ఇక ఆయన సోలో హీరోగా చేస్తున్న సినిమా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలో సందడి చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కానీ, దీని తర్వాత వెంకీ చేయనున్న సినిమా ఏదన్నది ఇంకా వెల్లడించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై నిర్మాత సురేశ్‌బాబు నుంచి స్పష్టత వచ్చింది. త్రివిక్రమ్ సినిమా పూర్తయిన వెంటనే వెంకటేశ్ 'దృశ్యం 3' కోసం రంగంలోకి దిగనున్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాని హిందీ 'దృశ్యం 3'తో పాటుగా అక్టోబరులో విడుదల చేసే అవకాశముందన్నారు. ఇక ఇప్పటికే 'దృశ్యం 3' మలయాళ వెర్షన్ చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. అది ఏప్రిల్‌లో విడుదల కానుంది.








# పాలమూరు జిల్లాలో వేడెక్కిన మున్సిపల్ పోరు

- రిజర్వేషన్ల ఖరారుతో రంగంలోకి ఆశావహులు
- సిఎం సొంత జిల్లా కావడంతో ప్రత్యేక దృష్టి
- అన్ని పార్టీల్లోనూ గెలుపుపై ఆశాభావం




**మహబూబ్‌నగర్,జనవరి20( వెలుతురు:**
ఉమ్మడి పాలమూరు జిల్లాపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. సిఎం సొంత జిల్లా కావడంతో పాటు, ఇప్పుడు ఇక్కడ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. తచూ జిల్లాలో ఏదో ఒక పనిమీద పరుగులు పెడుతున్నారు. దీంతో ఈ ఉమ్మడి జిల్లా మున్సిపాలిటీలపై ప్రత్యేక శ్రద్ద కనబరుస్తున్నారు. మహూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా.. జడ్చర్ల పాలకవర్గం పదవీ కాలం ఇంకా పూర్తి కాలేదు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని భూత్పూర్, దేవరకద్ర, కోస్గి, మద్దూరు, మక్తల్, నారాయణపేట మున్సిపాలిటీలు, మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో కాంగ్రెస్ హైకమాండ్ గెలుపు బాధ్యతలను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అప్పగించింది. మంత్రి దామోదరకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ బాధ్యతలను అప్పగించింది. ముందుగా ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని లీడర్లతో సమావేశం కానున్నారు. వార్డులు, డివిజన్లలో పార్టీ పరిస్థితి, ప్రతిపక్షాల బలాలు, బలహీనతలపై చర్చించనున్నారు. పార్టీ నుంచి పోటీకి ఎవరు ఆసక్తి చూపుతున్నారు. ఏయే స్థానాల్లో లీడర్ల మధ్య పోటీ ఎక్కువగా ఉంది. అక్కడ ఎవరిని బరిలోకి దింపితే గెలిచే అవకాశం ఉంది. ఎవరిని నిలపాలి..ఎవరిని తప్పించాలి.. రెబల్స్ ఉంటే వారిని బుజ్జగించి.. ఇతర అవకాశాలు కల్పించేలా హైకమాండ్ నుంచి హామీలు ఇప్పించే ప్రయత్నాలు చేయనున్నారు. దీనికితోడు వార్డులు, డివిజన్ల వారీగా ఎప్పటికప్పుడు ప్రజానాడిని, అక్కడి పరిస్థితులను లీడర్లతో సమీక్షించనున్నారు. అసరమైతే రెండు, మూడు డివిజన్లకు ఒక లీడర్‌ను ఇన్ చార్జీగా నియమించే అవకాశాలు ఉన్నాయి. వార్డులు, డివిజన్లలో పర్యటిస్తూ పార్టీ క్యాండిడేట్లను గెలిపించే బాధ్యతను తీసుకోనున్నారు. ఇకపోతే పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు పలుచోట్ల సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించి, ఖర్చులను వార్డు లీడర్లు భరించారు. నడిగడ్డలో ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించి మున్సిపల్ ఎన్నికలకు క్యాడర్ ను సిద్ధం చేసింది. బీజేపీ నాయకులు కూడా ప్రతిరోజు మీటింగ్ లు పెట్టుకుంటూ కార్యకర్తల్లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ కు చెందిన మాజీ మంత్రులు ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. గద్వాలలో 37 వార్డులు, అయిజలో 20 వార్డులు, అలంపూర్ లో 10, వడ్డేపల్లిలో 10 వార్డులు ఉన్నాయి. వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎన్నికల వేడి మొదలు అయింది. ఇప్పటికే కొన్ని చోట్ల వివిధ పార్టీల నుంచి పోటీలో ఉండే అభ్యర్థులు వార్డులో ప్రభావం చూపే ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. కుల సంఘాలు, యూత్ లీడర్లను కలిసి తమకు మద్దతు తెలియజేయాలని కోరుతున్నారు. గెలుపే లక్ష్యంగా పోటాపోటీగా ప్రచారం చేయడంతో పాటు నజరానాలు పంపిణీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గద్వాల మున్సిపాలిటీలో మూడు పార్టీలు బలంగా ఉండడంతో ఎక్కువ స్థానాలు గెలుపొంది చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అందరూ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, ఆలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో కూడా పోరు రసవత్తరంగా మారనుంది. వార్డుల్లో పోటీ చేసేందుకు ప్రతి వార్డుకు ముగ్గురిని ఎంపిక చేసి వారి పేర్లను హైకమాండ్‌కు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. లోకల్‌గా ఎలాంటి ఇబ్బంది లేకుండా హైకమాండ్ ఎంపిక చేసేలా చూస్తున్నారు. వార్డుల్లో గెలిచే అభ్యర్థులకే పార్టీ టికెట్ ఇచ్చేలా వ్యూహాత్మకంగా పార్టీలు వ్యవహరిస్తున్నాయి. వార్డుల్లో ఏ వర్గానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉన్నాయనే విషయంతో పాటు ఆర్థికంగా బలంగా ఉన్న అభ్యర్థులను నిలబెట్టేందుకు మూడు పార్టీలు తమవంతు ప్రయత్నం చేస్తున్నాయి.


## మేయర్ సీటు కోసం కాంగ్రెస్‌లో పోటీ

- బిసి మహిళకు రిజర్వ్ కావడంతో భార్యల రంగప్రవేశం

**మహబూబ్‌నగర్,జనవరి20( వెలుతురు:**
మహబూబ్‌నగర్ మేయర్ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో ఈ పీఠాన్ని దక్కించుకునేందుకు అధికార పార్టీలోని ప్రధాన లీడర్లలో కొందరు తమ వారసులు, భార్యలను పోటీకి దింపేందుకు సిద్ధమవుతున్నారు. సీనియర్ లీడర్ ఎన్పీ వెంకటేశ్ తన రాజకీయ వారసురాలిగా కూతురు నేహశ్రీని బరిలోకి దింపే అవకాశాలున్నాయి. వీరు ఉండే 14వ డివిజన్ బీసీ జనరల్‌కు రిజర్వ్ కావడం కలిసొచ్చింది. అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ సైతం తన భార్య ప్రసన్నను మేయర్‌గా పోటీకి దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరు ఉండే 49వ డివిజన్ జనరల్‌కు రిజర్వ్ కాగా.. ఇక్కడి నుంచి ఆమెను కార్పొరేటర్‌గా పోటీకి దింపాలని భావిస్తున్నారు. మరో లీడర్ రాఘవేందర్ రాజు సైతం తన సతీమణి వసంతను మేయర్‌ను చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. వసంత ప్రస్తుతం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా పని చేస్తున్నారు. ఇదిలాఉంటే ప్రసన్న, వసంత ఇద్దరూ 49వ డివిజన్ పరిధిలోని వారే. దీంతో వీరిద్దరూ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే చర్చ జరుగుతోంది. కాగా, కాంగ్రెస్ లీడర్ బురుజు సుధాకర్ సతీమణి కల్పన కూడా పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. 52వ డివిజన్ నుంచి కార్పొరేటర్ గా పోటీ చేసి మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

# శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసు

- విచారణలో దూకుడు పెంచిన ఇడి
- మూడు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు



**తిరువనంతపురం,జనవరి20( వెలుతురు:**
శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసుపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఇటీవల సుప్రీం కూడా ఈ ఏసుపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగళవారం మూడు రాష్ట్రాల్లోని 21 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేరళ, కర్ణాటక, తమిళనాడులలో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావన్‌కోర్ దేవశ్వం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్‌లకు సంబంధం ఉన్న ప్రాంతాల్లోను, వారి సన్నిహితులకు సంబంధించిన ఇళ్లల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు ఈ కేసుపై కేరళ హైకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మరింత క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టడానికి బంగారు తాపడాల పునరుద్ధరణ పనుల్లో భాగమైన ఇతర అధికారులను కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇటీవల అరెస్టైన టీడీబీ మాజీ అధ్యక్షులు ఎ.పద్మకుమార్, మాజీ సభ్యుడు కె.పి.శంకరదాస్‌ల హయాంలోనే ఈ అక్రమాలకు బీజం పడిందన్నారు. శబరిమల ఆలయంలో ఆన్-సైట్ తనిఖీ చేయాలని కేరళ హైకోర్టు ఇటీవల సిట్ అధికారులను ఆదేశించింది. మరోవైపు ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని భక్తులు, పలువురు అధికారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసులో ఆలయ ప్రధాన పూజారి సహా ఇప్పటివరకు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

# రాజ్యసభలో పలు బిల్లులు పెండింగ్

- జనభా నియంత్రణ సహా 19 బిల్లుకు దక్కని మోక్షం



**న్యూఢిల్లీ,జనవరి20( వెలుతురు:**
రాజ్యసభలో 19 ప్రభుత్వ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో 1992 నాటి జనాభా నియంత్రణకు సంబంధించిన బిల్లు కూడా ఉంది. రాజ్యసభ అనేది శాశ్వత సభ, ఇది ఎప్పటికీ రద్దు చేయబడదు. దాని సభ్యులలో మూడింట ఒక వంతు మంది ప్రతి రెండేళ్లకు పదవీ విరమణ చేస్తారు. లోక్‌సభ లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు సభ రద్దయితే, అవి కూడా రద్దవుతాయి. రాజ్యసభలో పెం డింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడూ రద్దు కావు. రాజ్యసభ బులెటిన్ ప్రకారం.. ప్రస్తుతం 19 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో పురాతనమైనది రాజ్యాంగ (79 సవరణ) బిల్లు-1992. జనాభా నియంత్రణ, చిన్న కుటుంబ నియమాన్ని ప్రభుత్వం ప్రోత్సహిం చాలని, ప్రాథమిక విధుల్లో చిన్న కుటుంబ నియమాన్ని ప్రోత్సహించడం, స్వీకరించడం చేర్చాలని ప్రభుత్వ విధాన నిర్దేశక సూత్రాలను సవరించాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే ఎంపి లేదా ఎమ్మెల్యేను అనర్హులుగా ప్రకటించాలని కూడా ఇది ప్రతిపాదించింది. పెండింగ్ బిల్లుల్లో ఢిల్లీ అద్దె (సవరణ) బిల్లు-1997 కూడా ఉంది. ఇది అ÷-దదె నియంత్రణ చట్టాలను ఆధునీకరించడానికి ఉద్దేశించిన ఢిల్లీ అ÷-దదె చట్టం-1995ను సవరించడానికి ఉద్దేశించబడింది. కానీ అద్దెదారులు, భూస్వామి సమూహాల నుండి గణనీయమైన వ్యతిరేకతను ఎదుర్కొంది. ప్రభుత్వం సీడ్ బిల్లు-2025 తీసుకు రావడానికి ప్రయత్నిస్తుండగా, పెండింగ్ బిల్లుల్లో సీడ్స్ బిల్లు-2004 ఉంది. ఇది అమ్మకం, దిగుమతి, ఎగుమతి కోసం విత్తనాల నాణ్యతను నియంత్రించడం, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సరఫరాను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన అంతర్రాష్ట్ర వలస కార్మికుల (ఉపాధి నియంత్రణ, సేవా పరిస్థితుల) సవరణ బిల్లు-2011 కూడా పెండింగ్‌లో ఉంది. యుపిఎ-2లో ప్రవేశపెట్టిన ఇతర పెండింగ్ బిల్లుల్లో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంబంధిత చట్టాలు (సవరణ) బిల్లు-2013, ఉపాధి మార్పిడి సవరణ బిల్లు-2013, పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్ వ్యవస్థీకరణ (మూడో) బిల్లు-2013 ఉన్నాయి. న్‌డిఎ పాలనలో ప్రవేశపెట్టిన పెండింగ్ బిల్లుల్లో అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాంలలో స్వయం ప్రతిపత్తి మండళ్ల ఆర్థిక, కార్యనిర్వాహక అధికారాలను పెంచడంతో ఈశాన్య ప్రాంతంలో గిరిజన స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేయడానికి ఉద్దేశించిన బిల్లు. ప్రవాస భారతీయుల వివా హ నమోదు బిల్లు-2019 వంటి బిల్లులు ఉన్నాయి. తాజాగా ది పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ బిల్లు-2020 పెండింగ్‌లో ఉంది.

# భార్యపై అనుమానంతో హత్య

- రోకలిబండతో బాది అంతమొందించిన భర్త

**హైదరాబాద్,జనవరి20( వెలుతురు:**
మూడు ముళ్ల బంధంతో ఏడు అడుగులు వేసి తనతో వచ్చిన భార్యపై ఓ భర్త అనుమానం పెంచుకున్నాడు. ఆగ్రహంతో ఆమెపై రోకలి బండతో దాడి చేశాడు. దీంతో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన హైదరాబాద్ బోరబండ అహ్మద్‌నగర్ డివిజన్‌లోని రాజీవ్ నగర్‌లో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భార్య సరస్వతి(35)పై భర్త అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో దంపతుల మధ్య తరచూ ఘర్షణ జరిగేది. అలాగే మంగళవారం మరోసారి ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహించిన భర్త.. భార్య తలపై రొకలి బండతో బలంగా కొట్టాడు. తలకు తీవ్ర గాయం కావడంతో.. ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానికులను విచారించిన పోలీస్ అధికారులు. వివరాలు సేకరించారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com